తీన్మార్
తెలుగు దినపత్రిక

## కార్చిచ్చుతో వ్యవహారం సుమా!

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ మామూలుగానే కోలాహలంగా ఉంటుంది. కానీ ఈ రోజు మరీ మరీ అతి కోలాహలంగా ఉంది. ఒక్కో వ్యాన్‌లో డజను, అర డజను మందిని చొప్పున తెచ్చి పడేస్తున్నారు. పైకి తిట్టుకోలేక, లోలోపలే సణుక్కుంటూ వచ్చిన వాళ్ల పేర్లు, చిరునామాలు రాసుకుంటున్నారు ఇద్దరు కానిస్టేబుళ్లు. మొత్తానికి అక్కడ అందరి కంటే పోలీసులకే బాధ ఎక్కువగా ఉన్నట్టుంది." నీదే కేసు " ? అని సుబ్బారావు పక్కనున్న అప్పారావుని అడిగేడు. " ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నాం, అందరూ రండి అని అహ్వానిస్తూ మా యోగా సెంటర్ నుంచి పదిమందిమి వలంటీర్లం కరపత్రాలు పంచుతున్నాం. ఇంతలో పోలీసు వ్యాను వచ్చింది. మమ్మల్ని ఎక్కించీసేరు. ఎందుకో, ఏమిటో తెలియదు. బహుశా సిఎం సభకు జనాలు చాల్లేదేమో, అందుకని పట్టుకుపోతున్నారేమో అనుకున్నాం. ఇదిగో, ఇక్కడ తెచ్చి పడీసేరు." అని అప్పారావు వివరిస్తున్నాడు. ఇంతలో పక్కనున్న ఓ ముసలాయన కల్పించుకున్నాడు. " మిమ్మల్ని ఇప్పుడు తెచ్చేరు. మమ్మల్ని తెల్లారకుండానే తెచ్చి పడీసేరు." అన్నాడు. "ఎందుకు సార్ ?" అడిగేడు సుబ్బారావు." ధనుర్మాసం కదా, తెల్లారకుండా నగర సంకీర్తన చేయడం మా భజన సమాజం ప్రతీ ఏడూ చేస్తొంటుంది. మరి ఈ పోలీసులకేమైందో, మమ్మల్ని వ్యాన్‌లో ఎక్కించి ఇక్కడకి తెచ్చేరు. అప్పటికీ మెల్లిగా పాడుకుందామర్రా అని మొత్తుకుంటూనేవున్నాను. ఇదిగో, మా వీరాస్వామి వీరభక్తితో రెండు, మూడు గొంతుకలతో ఘాట్టిగా రామనామము రామనామము రమ్యమైనది రామనామము అనగానే వచ్చేరు వీళ్లు " అని ఆ ముసలాయన గాభరాగా."మేము ప్రభువు శాంతి ప్రవచనాలను ప్రకటించుచూవుంటే ఈ రక్షకభటులు మమ్మల్ని ఇచ్చటకు తెచ్చితిరి. ఓ తండ్రీ ! వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు, వీరిని క్షమింపుడీ, మమ్మల్ని విడుదల చేయించుడీ " అని అందుకున్నాడు ఫాదర్ మరియదాసు.లోపల సిఐ రూమ్‌లో మెల్లిగానే మాట్లాడుతున్నాననుకుని గట్టిగా అరుస్తున్నాడు సిఐ. " టూ టౌన్ లోనూ ఇలాగే ఉందిట. ఈ గవర్నమెంటుకి పనీ పాటూ లేదేమో. తలా, తోకా లేని జీవోలు తేవడం, వాటిని అమలు చేయడానికి మా తల ప్రాణాలు తోకకి రావడం" అంటున్నాడు.షేక్ ఆలీ టీ కొట్టు సెంటర్ ఆ ఏరియాకే ఫేమస్. అక్కడ ఎప్పుడూ సందడిగా ఉంటుంది. అక్కడికొచ్చి టీ తాగడం దాదాపు అందరికీ ఆనవాయితీ. మామూలుగానే వచ్చేడు పచ్చలరావు అక్కడికి. పార్టీలు వేరైనా, షేక్ ఆలీ టీ మాత్రం అందరికీ మహా ఇష్టం. అందుచేత అక్కడికొచ్చినవాళ్లెవ్వరూ పోట్లాడుకోరు. మర్యాదపూర్వకంగానే అభిప్రాయాలు ప్రకటిస్తారు. అసెంబ్లీలో తన్నుకునేవాళ్లంతా ..షేక్ ఆలీ టీ తాగితే సభా మర్యాదను కాపాడడం తేలిక అని అక్కడి మేథావుల అభిప్రాయం. " ఇదేటిది ? పున్నేనికి పోతే పాపం ఎదురైనట్టు అయింది మావోడికి ? ఇదేటి కర్మరా బాబూ అని అందరవ్నూ కలిసి దుక్కపడ్డానికి ( ద్ఖుఖ పడడానికి) ఎల్తే అదేటి కరమవ్నో గాని ముగ్గురు సచ్చిపోనారు. ఆ ముందురోజు గావ్నోలు ఆరుగురో, మరెంతమందో కాలవలో బడి సచ్చిపో నారు. ఇప్పుడది సాల దన్నట్టు మావోల్లమీద కేసులెడతన్నారు. సిస్సీ! పనికిమాలిన పాలన!" అంటున్నాడు పచ్చలరావు."ఇలా ప్రజల హక్కుల్ని కాలరాసే చట్టాలు చేయడం దుర్మార్గం. ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలి" అంటున్నాడు అరుణకుమార్ . ఆ కుర్రాడు ఈ మధ్యనే కొత్తగా కమ్యూనిస్టు అయాడు. ఆ పక్కనే ఉన్న సామాన్యరావు "బాబూ! పెజాస్వామ్య వాదులంతే ఎవులు బాబూ? ఆలెక్కడుంతారు ? ఆలెందుకు కండించాల? మావ్వు ఎందుకు ఆ పని సెయ్యకూడదు ?" అని అరుణకుమార్‌ని అడిగేడు. అప్పుడు అరుణకుమార్ తమాయించుకుని "మనమంతా ప్రజాస్వామ్యవాదులమే. మనమందరమూ ఖండించాలి" అని క్లారిఫికేషన్ ఇచ్చేడు. "అదిగదీ, అలగ సెప్పు మాకు అరదం అయేలాగ" అని మెచ్చుకున్నాడు సామాన్యరావు. తన కొట్టుముందు జనం రద్దీ గనుక పెరిగితే తన కొట్టునే మూయించేస్తారేమో అని మరోపక్క కంగారు పడుతున్నాడు షేక్ ఆలీ. కంగారు తగ్గదు, వ్యాపారం మానుకోలేడు. అదీ అతడి సంకట పరిస్థితి. ఈలోపే అక్కడికొచ్చేడు నవరత్నారావు. అక్కడ జరుగుతున్న చర్చను ఫాలో అయేడు. అందరూ తమ నేత తీసుకున్న నిర్ణయాన్ని, జారీ చేసిన జివోని గురించే తిట్టుకుంటున్నట్టు గ్రహించేడు. లోలోపల కొంత గాభరా పడ్డాడు. కానీ తమాయించుకుని " మావోడెవుడను కున్నావు ? ఎలాటోడనుకున్నావు? కడగమృగం లాటోడు. మరంచేతనే ఇలాటి జివో తెచ్చేడు " అని సగర్వంగా ప్రకటించే డు. " ఓరదేటి పోలికరా ? మీ నాయకుడిని మృగంతో పోలుస్తావేటిరా ?" అని సామాన్యరావు అడిగేడు. " మరదే ఇసయం. నీ బోటి సామాన్యులకి అరదం కాదంతే. కడగ మృగం ఏటి సేత్తాది? ఆకులలమలే తింటాది. కానీ అడివిలో పెమాదం వొస్తే ముందుండేది ఆ కడగ మృగమే. టివీలో నిన్న రాతిరే జంతువుల చానెల్లో సూయిస్సేను గదా నేను ? అందుకే నాకరదమైపోనాది మావోడు సేసిన పని ఎనక రగస్యం." అని మరింత గర్వంగా చెప్పేడు నవరత్నారావు."ఓరి! నీకింతకీ ఏటరదమైనాదిరా ?" అని రెట్టించేడు సామాన్యరావు. "ఐతే మరి ఇనుకో. అడివికి పెమాదం ఎక్కడినుంచొత్తాది? " అని నవరత్నారావు అంటూండగానే అరుణకుమార్ "అడివికి కార్పొరేట్ల మితిమీరిన ధనదాహం వల్లనే ప్రమాదం వస్తుంది" అని జోక్యం చేసుకోబోయేడు. "బాబూ! నివ్వు కాసేపు పల్లకో. ఆడిని సెప్పనీ. ఆర్డరేసింది ఆల్ల నాయకుడే కదా . ముందు ఆడిని సెప్పనీ" అని వారించేడు సామాన్యరావు. మళ్ళీ నవరత్నారావు అందుకున్నాడు. " అడివికి కార్చిచ్చు నుంచి వస్తది పెమాదం. అప్పుడు తతిమ్మా జంతువులన్నీ లగెత్తుతాయి. కానీ మన కడగ మృగం అలా కాదు. ఇంకా కార్చిచ్చు పెద్దదవకమునుపే, చిన్న చిన్న మంటలుగా ఉన్నప్పుడే గబుక్కున ఆడికెల్లిపోయి కాల్లతో దానిని తొక్కీసి ఆరిపేత్తాది. మావోడూ అంతే. ఎక్కడా జనాలలో చిచ్చు తలెత్తనివ్వడు. అది పెద్దది కాకుండానే దానిని ఎలాగో ఒకలాగ ఆరిపేత్తాడు. అప్పుడు అంతా పెశాంతంగా ఉంటాది కదా. నవరత్నాలూ బెమ్మాండంగా వచ్చేత్తాయి కదా ! ఆ ఎర్రచొక్కాలోల్లు ఎప్పుడూ రోడ్లమీదకొచ్చి గొడవలు సేత్తూనేవుంటారు. మనలో మాట! అలు సెప్తున్నవన్నీ మన మంచికేననుకో. కానీ మావోడు ఎన్నని సేయగలడు సెప్పు? అటు అదానీని, అంబానీని సూసుకోవాల, ఇటు తన పారిటీ ఎమ్మెల్యేలనీ సూసుకోవాల, మజ్జెలో మోడీగోరికి కోపం రాకుండా కాసుకోవాల, అటు పచ్చసొక్కాలవాల్లనీ ఓ ఆటాడించాల, గబ్బర్‌సింగ్‌కీ అత్తారిల్లు సూపించాల. మరి ఇన్ని పనులు జరగాలంటే అంతా పెశాంతంగా ఉండాల. అంటే ఎక్కడా అల్లర్లు జరగకూడదు. అందుకే ఆ ఎర్రసొక్కాలవోల్లని ఎంబడెంబడే వేనులెక్కించేత్తూంటారు. ఆల్లని మాటాడని య్యరు

# సమస్యలపై స్పందించకుంటే 5 నుంచి ఉద్యమ బాట

మక్తల్, సెప్టెంబరు 26(తీన్మార్ న్యూస్): సెకండ్ ఏఎన్‌ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. తహాశీల్దార్ కార్యాలయం ముందు ఏఎన్‌ఎం ల నిరసన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం విధులు నిర్వర్తిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సెకండ్ ఏఎన్‌ఎంల కు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఇచ్చిన మూడు రోజుల నిరసనల పిలుపుమేరకు మంగళవారం నాడు నారాయణపేట జిల్లా మక్తల్ మండలం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి ఉపతహశీల్దార్ పుష్పలత, కర్ని గ్రామ పీహెచ్సీ కేంద్రం ముందు నిరసన వ్యక్తం చేసి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విరోజా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ గత 25, 30 సంవత్సరాలుగా 3 వేల రూపాయల వేతనం నుంచి కట్టుబానిసల్లా వెట్టిచాకిరి చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని, దశాబ్దాలు గడుస్తున్నా శ్రమదోపిడికి గురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య తీరు సరైంది కాదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని మొత్తం రెగ్యులరైజ్ చేస్తానని, అసలు కాంట్రాక్టు వ్యవస్థనే లేకుండా చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట నీటి మూటలా మారిందని కొండన్న విమర్శించారు. కోవిడ్ మహమ్మారి కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విశిష్టమైన సేవలు అందించిన వైద్య ఆరోగ్య సిబ్బంది అయిన



ఏఎన్‌ఎం లను పూల వాన కురిపించి వట్టి మాటలతో మాయ చేసి, ఏఎన్‌ఎంల చెవిలో పువ్వులు పెట్టారని ఆయన ఎద్దేవ చేశారు. సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని గత సంవత్సర కాలంగా అనేక రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో ఆగస్టు 16 నుంచి సమ్మెబాట పట్టారని, రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకు దిగి వచ్చి ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారం కొరకు ఐఏఎస్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని వేస్తామని, కమిటీ ద్వారా సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని సెప్టెంబర్ 4న సమ్మె విరమణ కోసం ఏఎన్‌ఎంల యూనియన్ కు విజ్ఞప్తి చేయగా, సెకండ్ ఏఎన్‌ఎంలు సమ్మె తాత్కాలిక వాయిదాకి అంగీకరించి, ప్రభుత్వ మాట, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గడల శ్రీనివాసులు ఇచ్చిన హామీతో సెప్టెంబరు నాలుగున 20 రోజులుగా సాగుతున్న సమ్మెకు తాత్కాలిక వాయిదా వేయడం జరిగిందని కొండన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసి 20 రోజులు గడుస్తున్నా కనీసం ఒక్క సమావేశం పెట్టకుండా యూనియన్ ల రిప్రజెంటేషన్ తీసుకోకుండా నాన్చుడు ధోరణిని ప్రదర్శిస్తున్నదని ఆయన ఆరోపించారు. తద్వారా కేసీఆర్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రెగ్యులరైజేషన్ మాటలాగే ఏఎన్‌ఎం లకు ఇచ్చిన ఈ మాట కూడా నీటి మూటలా మారకూడదని కొండన్న హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన త్రిసభ్య కమిటీ వేగవంతంగా పనిచేయాలని నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తున్నందువలన సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మండల తహశీల్దార్ కార్యాలయాల ముందు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పీహెచ్సి ఎదుట ఆందోళనలు చేసి నిరసన వ్యక్తం చేయాలని పిలుపు నిచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎంలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సెకండ్ ఏఎన్‌ఎం ల దీర్ఘకాలిక డిమాండ్ అయిన బేషరతుగా రెగ్యులరైజేషన్ హక్కుని అమలుచేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రావిడెంట్ ఫండ్ పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు మెటర్నిటీ సెలవులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వర్తించే సంవత్సరీక సెలవులను వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తోపాటు కోవిడ్ కరోనా సమయపు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కొనసాగించాలని, సహజ మరణానికి 10 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ శ్రామిక హక్కులను ఏఎన్‌ఎంలకు అమలు చేయాలని కొండన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్ నాయకులు డి వెంకటేశ్వరమ్మ, చంద్రకళ మునెమ్మ, శివలీల, లలిత, శశికళ, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

# పటిష్టమైన ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

### ఎలెక్టోరల్ రోల్ అబర్వర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ. శ్రీధర్

తాడ్వాయి, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): పటిష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఎలెక్టోరల్ రోల్ అబర్వర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ. శ్రీధర్ అన్నారు. మంగళవారం తాడ్వాయి మండల తాహాసిల్దార్ కార్యాలయంను ఎలెక్టోరల్ రోల్ అబర్వర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ. శ్రీధర్ సందర్శించి ఓటర్ల జాబిత పై ఏ ఈ ఆర్ ఓ, సూపర్వయిజర్లు, బిఎల్లోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ల జాబితా సిద్ధం చేసిన తీరును పరిశీలించారు. ఓటర్ల జాబితాలో 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్ల నమోదు, ట్రాన్స్జెర్మర్స్, దివ్యాంగులు నమోదు, ఫారం నంబర్ 6 ద్వారా ఓటర్ల నమోదు, 7 మరియు 8 ద్వారా మరణించిన, డబల్ ఓటర్లు,శాశ్వతంగా వలస




పోయిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను, చేసిన మార్పులు చేర్పుల తీరును పోలింగ్ బూత్లవారీగా ఆయా బిఎల్లోలు, సూపర్వైజర్లతో నేరుగా అడిగి, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్ రవీందర్, సూపర్వయిజర్లు బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన అంగన్వాడీలు



మక్తల్, సెప్టెంబరు 26(తీన్మార్ న్యూస్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్థానిక చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26,000/- ఇవ్వాలని, ఉ ద్యోగ భద్రత కల్పించాలని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజ్, పుంజనూరు ఆంజనేయులు, మరియు అంగన్వాడి ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ పై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ వాఖ్యలను ఖండించిన బక్క జడ్సన్




మడికొండ, సెప్టెంబర్ 26 తీన్మార్ న్యూస్): ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సోమవారం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ని హైదరాబాదులో తనపై ఎన్నికలలో పోటీ చేయాలని డిమాండ్ చేయడం సెక్యులర్ భావాలకు వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి సభ్యులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ చైర్మన్ బక్క జడ్సన్ ఖండించారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే బిజెపి, మోడీ, అమిత్ షా, యోగిలను నీపై పోటీ చేయమని చిత్తశుద్ధి చాటుకోమన్నారు. హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం మడికొండలో తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బక్క జడ్సన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ఎంఐఎం పార్టీని స్థాపించామని చెప్పుకుంటూ మైనారిటీల భావాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బిజెపితో, రాష్ట్రంలో బిఆర్ఎస్ తో దోస్తీ కట్టి తన ఆస్తులకు రక్షణ కవచంగా వాడుకుంటూ ఎంఐఎం పార్టీని స్థాపించి తద్వారా తన ఎంపీ పదవిని అనుభవిస్తూ ముస్లిం మైనార్టీలకు తీరని అన్యాయం చేస్తున్నాడని అన్నారు. నఫ్రత్ తోడో భారత్ జోడో అను నినాదంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ భారత్ జోడో యాత్ర సుమారు 4000 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర నిర్వహించాడని ప్రజల కు రాహుల్ గాంధీ పై విశ్వాసం పెరిగాయని, దేశంలో రాహుల్ గాంధీ ఎదుగుదలను చూసి ఓర్వలేక బిజెపి, బిఆర్ఎస్ కుట్రలో భాగంగా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సెక్యులర్ భావాలకు వ్యతిరేకంగా హైదరాబాదులో రాహుల్ గాంధీని తనపై పోటీ చేయమనడం విడ్డూరంగా ఉందని బక్క జడ్సన్ అన్నారు. భారత్ జోడో యాత్ర చేస్తూ రాహుల్ గాంధీ పేద మధ్యతరగతి, దళిత, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలందరినీ కలుస్తూ వారి స్థితి గతులు తెలుసుకొని వారి కష్టాలను కళ్ళతో చూస్తూ పేదల మధ్య మమేకమయ్యారని దేశ రాజకీయ చరిత్రలో మరో స్వాతంత్ర పోరాట నాయకుడిగా నఫ్రత్ తోడో భారత్ జోడో అంటూ నినాదంతో ప్రజలందరినీ ఏకం చేస్తూ పాదయాత్ర నిర్వహించారని జడ్సన్ అన్నారు. భారత దేశంలో దళిత వర్గాలపై, మహిళలపై, మైనారిటీ వర్గాలపై, బడుగు, బలహీన వర్గాల పై దాడులు చేయిస్తూ విచ్ఛిన్నం చేస్తున్న ఈ ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతూ దేశవ్యాప్తంగా సెక్యులర్ పార్టీ అయినటువంటి కాంగ్రెస్ పార్టీని ప్రజల నుండి దూరం చేయాలని ఎన్ని కుట్రలు పన్నిన బిజెపి, బిఆర్ఎస్ ఏజెంట్ ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అని తేటతెల్లమైందని జడ్సన్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకూస్, హనుమకొండ జిల్లా మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ నవీద్ మరియు తౌహీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో అన్నదానం




ఆలేరు, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కొలనుపాక జైన మందిరం సమీపంలో గల వినాయకుని మండపం వద్ద అమృతం నాగులు అనసూయ మరియు వెంకటేష్ కలమ్మ దంపతులు వారి కుమారుడు కిరణ్ జన్మదిన సందర్భంగా వినాయకుని మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఒగ్గు సంపత్, ఐల సిద్దులు, సాయి, అమృతం సాయి, ఒగ్గు క్రాంతి, తదితరులున్నారు.

# జిల్లా ఆస్పత్రిలో ఇన్ ఫెర్టిలిటీ క్లినిక్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్





ములుగు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఇన్ ఫెర్టిలిటీ క్లినిక్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో ఓయాసిస్ హాస్పిటల్ ఇన్ఫినిటీ వరంగల్ వారి సహకారంతో ఇన్ ఫెర్టిలిటీ క్లినిక్ ను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా క్లినిక్ ను నిర్వహిస్తున్న క్రమంలో ఆరోగ్య మహిళా క్లినిక్ వచ్చిన మహిళల్లో 4280 మంది ఔట్ పేషంట్లలో 30 మంది పైన మహిళలకు సంతానలేమి గల స్త్రీలను కనుగొనడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం నెలలో చివరివారం మంగళవారం నిర్వహించబడుతుందని అన్నారు. ప్రత్యేకంగా సుదూర ప్రాంతాల్లో ఉన్నవారికి ఇబ్బంది కలుతుందని తెలిసి ములుగు జిల్లా ఆస్పత్రిలో ఇది ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మహిళలు బిడియ పడకుండా తమకున్న సమస్యలు నేరుగా ఇన్ఫినిటీ ప్రత్యేక వైద్య నిపుణులకు చెప్పుకొని తగిన సేవలు పొందాలని కోరారు.

ఈ సందర్భంగా ఓయాసిస్ హాస్పిటల్ డాక్టర్ కావ్య ఇన్ఫిటిలిటీ మాట్లాడుతూ సంతానాలు లేమి పెళ్లయిన ఒకటి రెండు సంవత్సరాలలో ప్రతి స్త్రీ గర్భం దాల్చవలసి ఉంటుంది. అలా కాని పక్షంలో సంతానలేమి సమస్య ఉన్నదని ఉద్దేశం. జిల్లా కలెక్టర్ చొరువతో సేవ చేసేందుకు ముందుకు వచ్చిన దీనిని ప్రజలు ఉపయోగించు కోవలసినదిగా సూచించారు. అనంతరం ఈనెల 28న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చే ప్రారంభించనున్న జిల్లా ఆస్పత్రిలో స్పెషల్ నియోనటల్ కేర్ యూనిట్ ముందస్తు ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ జగదీష్, డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ అప్పయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్పిఎస్సి ని రద్దు చేయాలి



### - నిరుద్యోగులను రక్షించాలి

మక్తల్, సెప్టెంబరు 26(తీన్మార్ న్యూస్): దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం పేపర్ లీకులతో పరీక్షల రద్దులతో మొదటి స్థానంలో నిలిచిన ఘనత కెసిఆర్ కి దక్కుతుందని గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష రెండోసారి రద్దు కావడం ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య పూరిత వైఖరి అని నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో ఏబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టిఎస్పిఎస్సి నిర్వహించిన గ్రూప్ 1 ఇతర ప్రశ్నపత్రాలను అమ్ముకోవడానికి ప్రయత్నించి లక్షలాదిమంది నిరుద్యోగుల జీవితాలను రోడ్డున పడేసిన రాష్ట్ర ప్రభుత్వం పైన చేసిన అనేక ఉద్యమాల కారణంగా పరీక్షలను రద్దుచేసి నిర్వహించిన రీ ఎగ్జామ్ లో కూడా సరైనటువంటి చర్యలు పాటించకుండా ఇష్టానుసారంగా గ్రూప్ ఫిలిమ్స్ పరీక్షను నిర్వహించి రెండోసారి కూడా పరీక్ష రద్దుకి కారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వంశి , వినయ్, చరణ్ నిఖిల్, నితిన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఓ పోరాట యోధురాలు

**- జయంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పించిన మేయర్**




జవహర్ నగర్, సెప్టెంబర్ 26 ( తీన్మార్ న్యూస్): మున్సిపల్ పరిధిలో చెన్నాపురం చౌరస్తాలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మేయర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాటి సాయిధ తెలంగాణ పోరాటంలో ఐలమ్మ దొరలపై ప్రదర్శించిన తెగువ, ధైర్య సాహసాలు, పోరాటపటిమా ప్రతి ఒక్కరికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఆమె కొనియాడారు. ఆనాటి కాలంలోనే చాకలి ఐలమ్మ హక్కుల సాధన కోసం చట్టపరమైన పోరాటం చేసిన వీర వనిత అని సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని మేయర్ కావ్య చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో రజకులకు ఆత్మగౌరవంతో ఉండాలని లాండ్రీ షాపులు ఉన్నవారికి ఉచిత విద్యుత్ ఇస్తున్నారని మేయర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ రామలింగం, మహనీయుల కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్, కార్పొరేటర్లు, మేఘ లలిత యాదవ్, పల్లపు రవి, చిత్ర సుబ్రహ్మణ్యం కో-ఆప్షన్ మెంబర్లు శోభా రెడ్డి, శ్వేత, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



పెబ్బేరు, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 128వ జయంతి వేడుకలను పెబ్బేరు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్ రాములు ఆధ్వర్యంలో పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డ్ ముందున్న స్వర్గీయ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తొలిదశ తెలంగాణ ఉద్యమం లో దొరల గడిల పాలనను తుదముట్టించేందుకు వీరోచితంగా పోరాటం చేసిన వీరవనిత అని తెలంగాణ గడ్డపై రజాకార్ల ఆగడాలను చూసి చలించిన ఆమె రజాకార్ల పై రోకలి బండతో పోరాటం చేసి మహిళల సత్తా చాటారని ఆమె సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్,మండల ప్రెసిడెంట్ విజయ్ వర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, జిల్లా యువజన నాయకులు గంధం రంజిత్ కుమార్, టౌన్ ఉపాధ్యక్షుడు రజక నరసింహా, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, జిల్లా బీసీ సెల్ నాయకులు రాములు యాదవ్, మాజీ డైరెక్టర్ రాములు, సీనియర్ నాయకులు మోతె రాములు, రాజా గౌడ్,సోషల్ మీడియా ఇంచార్జ్ శ్రీకాంత్, టౌన్ యూత్ నాయకులు, వినయ్, హేమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# అధికారుల ఆలస్యం, నాయకుల నిర్లక్ష్యంతో ప్రజలు డెంగు బారిన పడుతున్నారు

**- ఐదో వార్డులో పర్యటించిన ఐక్యవేదిక**
**- సమస్యలు పరిష్కరించాలంటూ ఐక్యవేదికకు ఫిర్యాదు**





వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐదో వార్డులో మురుగునీటి సమస్య చాలా ఉన్నది, పలు కాలనీల నుంచి వచ్చే మురికి నీరంతా ఐదో వార్డ్ లో చేరటం ద్వారా మురికి నీరు ఇంట్లోకి వచ్చి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఆ మురికి నీటిలోని దోమలు అధికంగా ఉండటం వల్లన వార్డ్ ప్రజలు డెంగ్యూ బారిన పడుతున్నారు, దీంతో ప్రజలు హాస్పిటల్లో లక్షల కొద్ది బిల్లులు చెల్లించుకుంటున్నామని ఐక్యవేదికకు ఫిర్యాదు చేశారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు మున్సిపాలిటీకి కట్టే ఇంటి బిల్లులు, నల్ల బిల్లులు దేనికోసమని దానితో మౌలిక వసతులు కల్పించకుంటే ఎలాగని సతీష్ యాదవ్ ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెంటనే సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశించాలని ఐక్యవేదిక డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ గంధం కొండన్న, టీజేఎస్ ప్రధాన కార్యదర్శి ఎండి షఫీ, మాజీ కౌన్సిలర్ కుమారుడు ప్రేమ్, రమేష్ యాదవ్, ఐదవ వార్డ్ అధ్యక్షుడు కురుమూర్తి, కొండయ్య, శివరాజు, భాను, వెంకటేష్, చిట్టెమ్మ, వెంకటమ్మ తో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట నిప్పు కణిక

**- తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ**
**- సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్):.తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ ప్రతిఒక్కరికీ ఆదర్శమూర్తి అనీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని కొత్త బస్ స్టాండ్ కూడలి వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి మంత్రి పూమాలలతో నివాళు లర్పించారు. అనంతరం వివేకానంద కూడలి వద్ద వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కు మంత్రి భూమి పూజ చేసారు. ఈ సంధ్బంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ముద్దు బిడ్డలు, త్యాగధనులు, తొలిదశ, మలి దశలో అసువులు బాసిన అమర వీరులకు ప్రభుత్వం ద్వారా జయంతి ఉత్సవాలు, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. తద్వారా భావి తెలంగాణ సమాజానికి తెలంగాణ చరిత్ర గుర్తుండే విధంగా ఎప్పుడు మననం చేసుకునే విధంగా ఉంటాయి అన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ సైతం ఇందులో భాగమే అన్నారు. మహనీయులను ఎప్పుడు గుర్తుంచుకునే విధంగా విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గులాబీ మయంగా మారిన మంత్రి క్యాంప్ ఆఫీస్

**- జయహో నీళ్ల నిరంజనుడు అంటూ నినాదాలు**
**- కాంగ్రెస్ బిజెపి నాయకులు బీఆర్ఎస్ లో చేరిక**





వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): వనపర్తి మంత్రి క్యాంపు కార్యాలయంలో ఖిల్లాఘణపురం నుండి 100 మంది మైనారిటీలు, పెబ్బేరు మండలం గుమ్మడం నుండి కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన వెంకటస్వామి, యాపర్ల నర్సింహా, బాబు, వడ్ల నందు,ఈరపోగు మధు తదితరులు 100 మంది బీఆర్ఎస్ లో కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, మైనారిటీ ఆడబిడ్డలకు షాదీ ముబారక్, అర్హులయిన పేదలందరికీ ఆసరా పథకం కింద ఫించన్లు, పేద పిల్లల చదువుల కోసం సంక్షేమ గురుకులపాఠశాలలతో విద్య, పేదల వైద్యం కోసం ఇబ్బందులు లేకుం డా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలతో ఉచితంగా కాన్పులు, శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు, దయాలసిస్ కేంద్రాలు సాగునీటి రాకతో రైతులు, రైతు కూలీలకు చేతి నిండా పని, వలసపోయిన వారు తిరిగి రావడంతో కళకళలాడుతున్న పల్లెలు.అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు ప్రాతిపదికగా రాష్ట్రంలోసంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తున్నది కేవలం తెలంగాణనే అని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, ఖిల్లాఘణపురం సర్పంచ్ వెంకటరమణ, పెబ్బేరు మండల అధ్యక్షులు వనం రాములు తదితరులు పాల్గొన్నారు.

# 29న ఐటి మంత్రి కే. తారక రామారావు వనపర్తి పర్యటన

**- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి**
**- సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**





వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా సెప్టెంబర్ 29న రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కే.తారక రామారావు వనపర్తి జిల్లా పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, సంబధిత శాఖల అధికారులతో కలిసి కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల, ఐటీ హబ్ , బహిరంగ సభాస్థలి, సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్, సురవరం సాహితీ కళా భవనం లను సందర్శించి చివరి దశలో మిగిలిపోయిన పనులను పరిశీలించారు. సభాస్థలికి కావలసిన ఏర్పాట్లు, చారిత్రక కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల భవనం పునర్నిర్మాణ భవనం, సమీకృత మార్కెట్ భవనం, సురవరం సాహితీ భవనంలో ప్రారంభోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల పై కలెక్టర్, ఎస్పీ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 28 ఉదయం వరకు అన్ని నిర్మాణ పనులు పూర్తి అయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, అడిషనల్ ఎస్పీ ఆనంద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, మార్కెటింగ్ అధికారి శ్వరన్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ. మల్లయ్య, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర జిల్లా అదికారులు పాల్గొన్నారు.

# శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన

**- భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**






వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ యొక్క పనిని పూర్తి చేసి విగ్రహం తొందరలో ప్రారంభించుకోవాలని ప్రజా ప్రతినిధులందరికీ మంత్రి సూచన చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ గట్టి యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మార్కెట్ డైరెక్టర్ విజయ్, వనపర్తి పట్టణ మార్కెట్ యార్డ్ చైర్మన్ పలుసు రమేష్ గౌడ్, కౌన్సిలర్లు, వివిధ హోదాల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కిషన్ రెడ్డితోనే ఇబ్రహీంపట్నం అభివృద్ధి సాధ్యం

**- మొండిగౌరెల్లి సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ**
**- బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**



యాచారం, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డితోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని మొండిగౌరెల్లి గ్రామ సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ అన్నారు. గ్రామానికి చెందిన తీగల ముత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సర్పంచ్ బండిమీది కృష్ణ ను సంప్రదించగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్యే మంచిరెడ్డి సహకారంతో మంజూరైన 28 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ముత్తమ్మకు అందజేశారు. అభివృద్ధి సంక్షేమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ముందుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేయడంలో ఎమ్మెల్యే కిషన్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కట్టెల కృష్ణయ్య, యూత్ అధ్యక్షులు అంబేద్కర్, ఉపాధ్యక్షులు దేరంగుల శ్రీనివాస్, వార్డు సభ్యులు మౌనిక ప్రహ్లాద్, గజ్జల కృష్ణ, నాయకులు తీగల దశరథ, బండారి అంజయ్య, గురుక కుమార్, కర్నాటి యాదయ్య మాదం మల్లయ్య, కర్నాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


# సామాజిక కార్యకర్త సమక్షంలో కులాంతర, ప్రేమ వివాహం





భువనగిరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): సామాజిక కార్యకర్త సమక్షంలో సోమవారం రాత్రి భువనగిరి పట్టణ శివారులోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం లో కులాంతర ప్రేమ వివాహం జరిగింది. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, మన్నేవారిపంపు గ్రామానికి చెందిన బోయిని ఉప్పలయ్య జేష్ఠ కుమారుడు బోయిని జంఫేష్(26), చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట్ కు చెందిన గుణమేని జంగయ్య కనిష్ట కుమార్తె తేజశ్రీ (23) ని వివాహం చేసుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న కులరహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి ఆధునిక సమాజంలో ప్రేమ వివాహాలు చాలా వరకు విఫలమవుతున్నాయని, ప్రేమ వివాహాలు కూడా సఫలం అవుతాయని నిరూపిస్తూ, నూతన దంపతులు కలిసి మెలిసి ఉండాలని ఆయన కోరారు. అనంతరం శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం లో వివాహం చేసుకున్న నూతన వధూవరులను, దేవాలయ పూజారి, మరియు, వరుని స్నేహితులు అభినందనలు తెలిపి, శుభాశీస్సులు అందజేశారు.

# పేదలకు ప్రయోజనం.. ఆసుపత్రికి ఆదాయం



మంచిర్యాల : ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ సేవలు పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలిగిస్తున్నాయి. ఈ లబ్ధిని సర్కారు ఆసుపత్రులు సద్వినియోగం చేసుకుంటున్నాయి. బాధితులకు మెరుగైన వైద్యంతో పాటు ప్రభుత్వ సిబ్బంది వారికి వచ్చే వేతనంతో అదనంగా నగదు ప్రోత్సాహం అందుతుంది. దీంతో గతంలో మాదిరిగా కాస్త కష్టమైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలించకుండా స్థానికంగా నిర్వహిస్తూ బాధితులకు అవస్థలు, దూరభారం నుంచి ఉపశమనం కలిగిస్తున్నారు. ఈ పథకాన్ని అన్ని ఆరోగ్య కేంద్రాలు వినియోగించుకునే పరిస్థితి ఉన్నా కొన్నిచోట్ల మాత్రమే అమలవుతోంది. పీహెచ్‌సీ స్థాయిలో ఉపయోగించుకుంటే ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే ఆదాయంతో ఆయా ఆరోగ్య కేంద్రాలఅభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందకుపైగా ఆరోగ్యకేంద్రాలు ఉన్నా 21 కేంద్రాల్లోనే ఈ సేవలు అమలు చేస్తున్నారు. గతంలో ఆరోగ్యశ్రీ పథకంతో పరిమితంగా చికిత్స అందించే అవకాశముం దేది. ప్రస్తుతం దీనికి అదనంగా ఆయుష్మాన్ భారత్ జత చేరడంతో వందల రకాల వ్యాధులకు లబ్ధి పొందే అవకాశముంది. 32 విభాగాలకు సంబంధించి 1668 రకాల వ్యాధులకు చికిత్స పొందవచ్చు. సాధారణ జ్వరం నుంచి గుండె సంబంధిత శస్త్రచికిత్సలు ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ ద్వారా పొందవచ్చు. ఈ పథకం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అమలు చేస్తుండటంతో ఓవైపు బాధితులకు, మరోవైపు ఆసుపత్రి, సిబ్బందికి ప్రయోజనం చేకూరుతోంది.


# మంగలితండా గ్రామంలో బాలుడికి డెంగ్యూ పాజిటివ్

**- పాజిటివ్ పై సమాచారం లేని వైనం**

**- గ్రామంలో 50 మందికి పైగా జ్వరంతో మంచనా పడ్డారు**

**- అటువైపు చూడని అధికార యంత్రాంగం**

పాలేరు, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తూ వైద్య రంగంలో విప్లవాత్మమైన మార్పులు తెస్తూ ఆరోగ్య తెలంగాణకు నడుం బిగించింది. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి అనిపిస్తుంది. పల్లెల్లో ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి నర్సులను నియమించింది. వర్షా కాలంలో డెంగ్యూ ,మలేరియా ప్రభలే అవకాశం ఉందని, అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్న కూసుమంచి మండలంలో ఆరోగ్య శాఖకు అనారోగ్యం అంటుకున్నట్టుంది. గ్రామ స్థాయిలో ఆశ కార్యకర్త ఏఎన్ఎం, పంచాయితీ సెక్రటరీ లు విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఒక గ్రామంలో 2 ఏండ్ల బాలుడికి డెంగ్యూ పాజిటివ్ వచ్చి ట్రీట్మెంట్ తీసుకొని డిఛార్జ్ అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తీన్మార్ న్యూస్ రిపోర్టర్ కు ఉన్న సమాచారంతో ఆ గ్రామానికి వెళ్లి విచారించగా తెజవత్ దీక్షిత్ సాయి కి డెంగ్యూ పాజిటివ్ అని తెలిసింది. కానీ ఇప్పటివరకు కనీసం ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, పంచాయితీ సెక్రటరీ వద్ద సమాచారం లేదంటే వారి నిర్లక్షం బయటపడుతుంది. ఇక వివరాలు ఇలా ఉన్నాయి. కూసుమంచి మండలం మంగళితండా గ్రామంలో తేజవత్ దీక్షిత్ సాయి (18నెలలు) ఇటీవల వరుసగా బాబుకు జ్వరం వస్తూ పోతూ ఉండడంతో మొదట మామూలు జ్వరంగానే భావించిన



Khammam.

| | | | |
|---|---|---|---|
| Patient Name | T.NAVADEEP | Age/Sex | 18M/M |
| ID Number/MR | 18270/19486 | Visit Date | 22/09/23 |
| Referred by Dr | DR.V.DEVENDER MD,(PEDIATRICS) | | |

NATURE OF INVESTIGATON
DENGUE
NATURE OF SPECIMEN :SERUM

SEROLOGY( RAT)
DENGUE REPORT

NS1 Antigen : NEGATIVE
IgM Antibodies : WEAK POSITIVE
IgG Antibodies : NEGATIVE
RESULT : POSITIVE

.........End of SEROLOGY Report........
Signature of the lab incharge
Checkd By:
....Kindly correlate clinically.`If necessary discuss/repeat.
Method: Rapid Visual test for the detecation of Dengue NS1 Ag& deffrential Detection of IgM & IgG antibodies in Human Serum/Plasma

తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపి ల చూపించిన ఎంతకు జ్వరం తగ్గక పోవడంతో ఖమ్మంలోని ఓ ప్రవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్ళి టెస్టు చేపించగా రిజల్ట్ డెంగ్యూ పాజిటివ్ అని చెప్పారు. వెంటనే అదే హాస్పిటల్ లో చేర్పించి చికిత్సను అందించడంతో ఇప్పుడిప్పుడే బాబు కోలుకుంటున్నాడు. దీక్షిత్ సాయి కి జ్వరం వస్తున్నట్టు తెలియగా స్థానిక ఆశ కార్యకర్త టాబ్లెట్స్ ఇచ్చిందని తరువాత అటువైపు తిరిగి చూడలేదని చెపుతున్నారు. ప్రతి వారం మంగళవారం, శుక్రవారం



గ్రామాల్లో డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి ఉంటే తేజవత్ దీక్షిత్ సాయికి డెంగ్యూ పాజిటివ్ అనే సమాచారం ఉండేది. గ్రామాల్లో పల్లె దవాఖాన ఏర్పాటు చేసి ప్రజా ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెపుతున్న ఆ మాటలు పెడచెవిన పెట్టినట్టున్నారు. ఇప్పటికీ ఆ గ్రామంలో 50 మందికి పైగా జ్వరం బారిన పడినట్టు సమాచారం. ఇకనైనా అధికారులు స్పందించి మంగలితండా గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలనీ, ఇంటింటికీ తిరిగి జ్వరం వస్తూన్న వారి వివరాలు సేకరించాలి. అలాగే గ్రామం మొత్తం శానిటేషన్ చేపించాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఇకనైనా అధికారులు దృష్టి సారించాలని లేకపోతే డెంగ్యూ పాజిటివ్ కేసులు పెరిగే అవకాశం ఉంది.

# మార్కెట్ కమిటీ జ్యోతి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గొంగిడి దంపతులు





రాజాపేట, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ విప్, డిసిసిబి చైర్మన్ గొంగిడి సునీత, మహేందర్ రెడ్డిలు కేక్ కట్ చేసి జ్యోతిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మోత్కుపల్లి ప్రవీణ్, రఘునాథపురం ఉప సర్పంచ్ పల్లె ప్రవీణ్, గంధ మల్ల సురేష్, మోత్కుపల్లి బాలకృష్ణ లు పాల్గొన్నారు.

# భవ్య శ్రీ మృతికి కారణమైన మానవ మృగాలకు ఉరి శిక్ష విధించాలి

**- వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన**

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): చిత్తూరు జిల్లా పెనుమూరు, వేణుగోపాలపురం గ్రామం లో గతవారం దారుణ హత్యకు గురైన మైనర్ బాలిక తోకల భవ్య శ్రీ మృతికి కారణమైన నిందితులకు ఉరి శిక్ష విధించాలని కోరుతూ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ అంబేద్కర్ విగ్రహం వద్ద క్రోవ్వత్తుల ప్రదర్శన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ లు మాట్లాడుతూ భవ్యశ్రీ ని గతవారం క్రితం నలుగురు కామాంధులు కలిసి హత్యాచారం చేయడమే కాకుండా హత్య చేశారన్నారు. అనంతరం చెట్టుకు ఉరితీసి, వెంట్రుకలు తీయడమే కాక కన్ను బోమ్మల వెంట్రుకలు కూడ తీసి అతి కూర్రంగా హత్య చేశారని అన్నారు. అంతటితో ఆగకుండా భావిలో వేశారన్నారు. దేశంలో రోజురోజుకు వడ్డెర వృత్తిదారుల మహిళలపై దాడులు జరుగుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కూడ వడ్డెర్లపై అబ్దుల్లాపూర్ మెట్టు దగ్గర అండాలు, నిన్నకాక మొన్న మిర్యాలగూడ లో దండుగుల శోభ నేడు చిత్తూరు జిల్లాలో భవ్యశ్రీ ఇలా హత్యలకు, హత్యచారాలకు గురౌవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఉన్నవర్గాలకు నిమ్నన క్రింది కులాలకు ఒక న్యాయమా అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి సంఘటనలు జరుగుతున్న ఎలాంటి



చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే భవ్యశ్రీ హంతకులను బహిరంగంగా ఊరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం సీనియర్ నాయకులు గండికోట సత్యం, తుర్కయాంజాల్ మున్సిపల్ అధ్యక్షులు నర్ర పాండు, వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు నర్ర శ్రీధర్, వేముల మల్లేష్, పల్లపు మల్యాద్రీ, ఓర్పు వెంకటేష్, ఓర్పు శ్రీను, వరికుప్పల శ్రీకాంత్, అందువల్ల సందీప్, వేముల వాసు, వరికుప్పల వెంకటేష్, బొదదాసు నగేష్, బోదాసు గిరి, రేపని రాములు, వరికుప్పల నవీన్, బోదాసు సదయ్య, వరికుప్పల చిరంజీవి, వరికుప్పల నర్సింహ్మా, ఓర్పు శేఖర్, లాలూ, బొంత విష్ణు, కమ్మగూడ 22వ వార్డు బిఅర్ఎస్ అధ్యక్షులు గుండ్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో దేశంలోకి రష్యా క్రూడాయిల్!

బెంగళూరు: రష్యా నుంచి మన దేశానికి క్రూడాయిల్ దిగుమతులు అంతకంతకూ పెరుగుతున్నాయి. తక్కువ ధరకే లభిస్తుండడంతో భారత్ భారీ స్థాయిలో ముడి చమురును కొనుగోలు చేస్తోంది. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి కొనసాగుతుండగా.. జనవరి నెలలో ఎప్పుడూ లేని స్థాయికి చేరింది. ఒకప్పుడు ఒక శాతం కూడా లేని దిగుమతులు ఇప్పుడు ఏకంగా 28శాతానికి చేరినట్లు ఎనర్జీ కార్గో ట్రాకకర్ వొర్టెక్సా వెల్లడించింది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు ముందు రష్యా నుంచి మన క్రూడాయిల్ దిగుమతులు కేవలం 0.2 శాతం మాత్రమే. ఉక్రెయిన్‌పై దాడి తర్వాత పశ్చిమ దేశాలు ఆ దేశంపై ఆంక్షలు విధించాయి. దీంతో ఆదాయం కోసం ముడి చమురును డిస్కౌంట్ ధరకే ఆ దేశం అందిస్తోంది. దీంతో చైనా, భారత్ ఆ దేశం నుంచి తక్కువ ధరకే క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో రష్యా ముడి చమురు వాటా 28 శాతానికి చేరింది. డిసెంబర్‌లో ఈ వాటా 26 శాతంగా ఉంది. రష్యా తర్వాత ఇరాక్ (20 శాతం), సౌదీ అరేబియా (17 శాతం), అమెరికా (9 శాతం), యూఏఈ (8 శాతం) అత్యధికంగా మన దేశానికి క్రూడాయిల్‌ను ఎగుమతి చేస్తున్నాయి. దేశీయ అవసరాలు తీర్చుకోవడానికి ప్రపంచంలో ఎక్కడి నుంచైనా ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమానికి హాజరైన అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి కి జర్నలిస్టుల పాలాభిషేకం



ఆలేరు, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): ఆలేరు పట్టణ కేంద్రంలో సోమవారం సర్వేనెంబర్ 1026లో, ఒక ఎకరం 10 గుంటలు ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత, ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ మహేందర్ రెడ్డి చిత్రపటానికి జర్నలిస్టులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థలము కేటాయించినందుకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లు మండల అధ్యక్షుడు గుండు మహేందర్, గౌరవ అధ్యక్షుడు జాల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి, దడిగ రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరె భాను ప్రసాద్, సిరిగిరి స్వామి, ప్రచార కార్యదర్శి ఆరే సాయికుమార్, హనుమకొండ ఉపేంద్ర చారి, ఎండి షానూర్ బాబా,కుల సిద్ధులు, సీస సాయి, ములకల రవి, ఎలుగల కుమారస్వామి, వెంకటేష్ శ్రవణ్, నరేష్, ఉపేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేట లో చాకలి ఐలమ్మ 128 వ జయంతి వేడుకలు

**- నివాళులర్పించిన మండల నాయకులు**



రాజాపేట, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీర వనిత ఐలమ్మ జీవితం రజాకారులపై ఆమె చేసిన పోరాటం తెగువను నేటి తరం స్ఫూర్తి గా తీసుకోవాలి అని, మంగళవారం చాకలి ఐలమ్మ 128వ జయంతి సందర్భంగా రాష్ట్ర రజక సంఘం కన్వీనర్ సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో మండల అఖిలపక్ష నాయకులతో మండల కేంద్రంలో గాంధీ చౌరస్తా వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి భుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిలించిన అగ్ని కణం చిట్యాల ఐలమ్మ రజక కుటుంబంలో పుట్టిన ఒక ఆడపడుచు వేల ఎకరాల అధిపతి అయిన దొర దోపిడిని ఎదిరించి నిలిచింది అని దున్నేవాడిదే భూమి అని సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ నిప్పురవ్వ అని, రైతు కూలీలను ఏకం చేసి ఉద్యమానికి ఊపిరి ఊదింది భూమి లేకపోతే జిందగీ లేదని రక్త తర్పణం చేసిన ఐలమ్మ బంధంగి దారిలో నడిచింది అని 1995 సెప్టెంబర్ 26న సద్దుల బతుకమ్మ నాడు ఓరుగంటి మల్లమ్మ సాయిలు నాలుగో సంతానంగా జన్మించింది ఐలమ్మ తల్లిదండ్రులది ఉమ్మడి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురం 11వ ఏట పాలకుర్తి కి చెందిన చిట్యాల నరసయ్యతో లగ్గం అయింది ఆమెకు అయిదుగురు కొడుకులు ఒక్క కూతురు దొర ఇంత ఊడిగం ఉరి జనం బట్టలు ఉతకడం అదే వారి జీవనాధారం దీంతో కుటుంబం గడవడం గగనమైంది పల్లెల్లో దొరల పట్టు తగ్గింది బంధంగి రక్త తర్పణంతో ఎరుపెక్కిన పోరు జెండా ఐలమ్మ సాహసంతో సాయుధ పోరు దారి చూపింది. యావత్ తెలంగాణ మహిళ పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10 న తుది శ్వాస విడిచింది అని అన్నారు. తెలంగాణ మట్టిలోనే పోరాట తత్వం ఉందని చెప్పడానికి ఐలమ్మ జీవితమే నిదర్శనం అని రమణారెడ్డి చెప్పుకొచ్చారు. హక్కుల కోసం ఐలమ్మ చేసిన ఆత్మగౌరవ పోరాటం స్ఫూర్తితో తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని వివరించారు. వారిని స్మరించుకుంటూ ఐలమ్మ జయంతి వర్ధంతి కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ సబండ వర్గాల త్యాగాలనుస్మరించుకుంటున్నామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమిలా మహేందర్ గౌడ్, సీనియర్ నాయకులు మంచాల భద్రయ్య, ఆడెపు శ్రీశైలం, ఎర్ర గోగుల జస్వంత్, మొగిలి ఇస్తారి, ఐరేని నవీన్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాంగళ్ల శీను, ప్రభాకర్, సాయి, మండల రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దుబాయి కరెన్సీ మార్పిడి పేరుతో మోసం



జడ్చర్ల: దుబాయి కరెన్సీ మార్చుకుని లాభపడాలనుకున్న దంపతులను గుర్తు తెలియని వ్యక్తి నిలువునా ముంచాడు. వారి నుంచి రూ.5 లక్షలు తీసుకుని ఉడాయించిన ఘటన ఆదివారం జడ్చర్లలో జరిగింది. సీఐ రమేశ్‌బాబు, ఎస్సై లెనిన్ కథనం మేరకు వివరాలు.. మహబూబ్‌నగర్‌లోని మదీన మసీదు సమీపంలో నివాసం ఉంటున్న సిరాజుద్దీన్ ఆప్టికల్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈయనకు వద్దకు వారం రోజుల క్రితం గుర్తు తెలియని ఓ వ్యక్తి వచ్చి తన వద్ద దుబాయ్ కరెన్సీ (దిర్‌హమ్) ఉందని, వాటిని తీసుకుని ఇండియన్ కరెన్సీ ఇవ్వాలని కోరాడు. కరోనా సమయంలో తన వద్ద దిర్‌హమ్స్ ఉండి పోయిందని చెప్పుకొచ్చాడు. తన వద్ద ఉన్న దిర్‌హమ్స్‌ను చూపించాడు. ఇండియన్ రూపాయి విలువ ప్రకారం సుమారు 35 లక్షల వరకు ఉంటుందని, వాటిని తీసుకొని రూ.10 లక్షలు ఇవ్వాలని కోరాడు. జడ్చర్లలోని రైల్వేగేటు సమీపంలో గ్రంథాలయం వద్దకు రావాలని సిరాజుద్దీన్, ఆయన భార్య యాస్మిన్‌ను సూచించాడు. అక్కడికి ఎందుకు రావాలని వారు ప్రశ్నించడంతో దిర్‌హమ్స్ అక్కడే ఉన్నాయని తప్పుదోవ పట్టించాడు. అత్యాశకు పోయిన వారు ఆదివారం జడ్చర్లకు చేరుకుని రూ.5 లక్షలు దుండగుడికి ఇచ్చారు. అతను దుబాయి కరెన్సీ ఉందని ఓ సంచి ఇచ్చాడు. వారు సంచి తెరచి చూడగా అందులో కాగితాలు కనిపించాయి. దుండగుడిని పట్టుకునేందుకు యత్నించగా అతను మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రమేశ్‌బాబు, ఎస్సై లెనిన్ బృందం ఘటనా స్థలాన్ని చేరుకొని విచారణ చేశారు

# ఆలేరు బిజేపి కార్యాలయం లో గణనాథుని పూజలు



ఆలేరు, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక బిజెపి కార్యాలయం లో మంగళవారం నాడు బిజేపీ జిల్లా కార్యదర్శి సముద్రాల కల్పన అధ్వర్యంలో ఘనంగా ఆ గణనాధుని కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలేరు ప్రజలు అందరూ సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. వారి వెంట మహిళా మోర్చ పట్టణ అధ్యక్షులు కీర్తి, విజయ లక్ష్మి, అనసూయ, లలిత, లక్ష్మి, విజయ, జ్యోతి, ఉమ, తులసి, భాగ్య, తదితరులు ఉన్నారు.

# ఆధార్‌తో జత.. పనిలో పారదర్శకత!

కరీంనగర్: ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసే క్రతువులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జోరు చూపిస్తోంది. పని ప్రదేశంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కీలకమైన ఆధార్ అనుసంధానంలో నాలుగు జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. దాదాపు 94 శాతం జాబ్‌కార్డుతో జత చేశాయి. ఈ విధానాన్ని వేగంగా అమలు చేస్తున్న జిల్లాల జాబితాలో మన జిల్లాలు అగ్రభాగాన ఉన్నాయి. జనవరి మొదటి వారంలో ప్రారంభమైన కార్యక్రమం మరో వారం రోజుల్లో శతశాతాన్ని చేరుకోనుంది.

మొదట్లో క్షేత్ర స్థాయిలో ఈ పని మందకొడిగా కనిపించినా.. గత నెలాఖరులో మాత్రం చివరి దశకు చేరుకుంటుంది. ఊరూరా చేపడుతున్న పనుల్లో అసలు తప్పులకు చోటులేకుండా పనిని సజావుగా, పారదర్శకంగా జరిపించే ఉద్దేశంతో గత నెల మొదటి రోజు నుంచి ఆన్‌లైన్ హాజరును తెరపైకి తీసుకొచ్చారు. గతంలో సామాజిక తనిఖీల సమయంలో బయటపడ్డ నిధుల దుర్వినియోగం, అవకతవకలను దృష్టిలో పెట్టుకుని ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

అసలు కూలీలు పనికి రాకుండానే దినసరి వేత నాలను కాజేసిన ఉదంతాలు కోకొల్లలు. అందుకనే కేంద్ర ప్రభుత్వం ఊళ్లల్లో చేపట్టే ప్రతి పని పక్కాగా జరపాలనే సదుద్దేశంతోపాటు ప్రజల సొమ్మును సరైన పనులకు వినియోగించుకునే ఈ విధానాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పనికి సక్రమంగా వచ్చే వారి వివరాలను నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ (ఎన్ఎంఎంఎస్)లో పొందుపర్చారు. ఊరూరా చేపడుతున్న పనుల్లో అసలు తప్పులకు చోటులేకుండా పనిని సజావుగా, పారదర్శకంగా జరిపించే ఉద్దేశంతో గత నెల మొదటి రోజు నుంచి ఆన్‌లైన్ హాజరును తెరపైకి తీసుకొచ్చారు.

# పనులు చేసే నాయకులకే ప్రజల మద్దతు

మంచిర్యాలటౌన్, : ప్రజల అవసరాలను తెలుసుకుని పనులు చేసే నాయకులకే జనం మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు.మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఐదోవార్డు మజీద్‌వాడలో కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలోనే అమలవుతున్నాయని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనా విధానమే కారణమని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనల్లో నుంచి పుట్టుకువచ్చిన సంక్షేమ పథకాలు దేశంలోనే అద్భుతంగా నిలుస్తున్నాయని తెలిపారు.

# గొలనుకొండ బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షునిగా అశోక్



ఆలేరు, సెప్టెంబర్ 26(తీన్మార్ న్యూస్): బిఆర్ఎస్ యువజన విభాగం ఆలేరు మండలంలోని గొలనుకొండ అధ్యక్షునిగా కొమ్మరాజుల అశోక్ మంగళవారం ఎన్నికైనారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ఆలేరు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయడం కోసం కృషి చేస్తూ ముచ్చటగా మూడోసారి గొంగిడి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



నార్కట్‌పల్లి, : మండలంలోని అమ్మనబోలు–పొడిచేడు గ్రామాల మధ్య ఉన్న మూసీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని అమ్మనబోలు గ్రామస్థులు డిమాండ్ చేశారు. అమ్మనబోలులో ఎడ్లబండ్లను రోడ్డుకు అడ్డంగా నిలిపిన గ్రామస్థులు సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మూసీ వాగునుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక మాఫియా మామూళ్లకు అలవాటుపడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సర్పంచ్ భర్త బద్దం రాంరెడ్డి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాపై అంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేద్దామని సముదాయించారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేయడంతో రాస్తారోకోను విరమించారు. మూసీ వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజ మానుల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10వేల చొప్పున వసూలు చేయాలని 10రోజుల క్రితం గ్రామానికి చెందిన ముఖ్యులు సమావేశమై నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి ట్రాక్టర్ యజమానులు కూడా అంగీకరించినట్లు సమాచారం. అయితే గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా ముఖ్యులందరితో కమిటీ ఏర్పాటుచేసి ఆ కమిటీకి డబ్బులు చెల్లించడం ద్వారా సమకూరే నిధులను గ్రామంలో గుళ్లు, గోపురాలు, బడుల్లో మౌలిక సదుపాయాల కోసం వెచ్చించాలని నిర్ణయించినట్లు వినికిడి. ఇదిలా ఉంటే ట్రాక్టర్ యజమానుల నుంచి డబ్బు తీసుకుని ఇసుక లోడ్లకు అనుమతిస్తే తమ సంగతేంటని గ్రామానికి చెందిన ఎడ్ల బండ్ల యజమానులు శుక్రవారం రోడ్డెక్కినట్టు అంతా చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో కొందరు యువకులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వారితో గొంతుకలిపారు. ఇదిలా ఉండగా, మూసీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాలో సర్పంచ్‌కు మామూళ్లు అందుతున్నాయని ఇటీవల నిర్వహించిన గ్రామసభలో కొందరు ఆరోపించినట్టు తెలిసింది. ఈ ఆరోపణలపై స్పందించిన సర్పంచ్ భర్త రాంరెడ్డి ఇసుక అక్రమ రవాణాకు ట్రాక్టర్ యజమానులు తనకు డబ్బులు ఇచ్చారనే విషయాన్ని ఖండిస్తూ శివాలయం వద్ద ప్రమాణం చేసినట్లు సమాచారం.

# ఆదిలోనే తెగులు.. ఆందోళనలో అన్నదాతలు



భైంసా, న్యూస్‌టుడే : ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినా గత్యంతరం లేక అన్నదాతలు ఏటికి ఎదురీదినట్లు సేద్యం చేస్తూనే ఉన్నారు. అయినా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. విత్తనం వేసింది మొదలు పంట చేతికొచ్చేదాక ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. యాసంగిలో వరిసాగుకు నారు పోసుకున్న రైతులు తీవ్ర చలితో సగానికి పైగా మొలకెత్తక మళ్లీ విత్తనాలు వేసుకున్నారు. నాట్లు వేశాక వారం పది రోజుల్లో పచ్చబడాల్సిన నారు ఎర్రబడటం మొదలైంది. దీంతో ఎకరాకు 4 కేజీల గుళికల మందు, ఎరువులు వాడినా పొలం పచ్చబడటంలేదని రైతులు వాపోతున్నారు. మొక్కల మొదళ్లలో మొగి పురుగు ఆశించి ఆకులు మాడిపోయి నాటు వేసిన పాదులు కుళ్లిపోయినట్లుగా కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కొందరి పొలాలు ఎండి పోయాయి. రైతులకు తెలిసిన ఎన్ని పురుగు మందులు పిచికారి చేసినా ప్రయోజనం కనిపించడంలేదు. జిల్లాలో 92వేల ఎకరాల్లో రైతుల వరి నాటు వేస్తున్నారు. నెల రోజులుగా కొనసాగుతున్న నాట్లు దాదాపు 80వేల ఎకరాల్లో పూర్తయినట్లు తెలుస్తోంది. రైతులకు సూచనలు సలహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేసింది. రూ.కోట్లు వెచ్చించి క్లస్టర్‌కో రైతు వేదిక నిర్మించింది. వాటిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి సూచనలు సలహాలు ఇవ్వాలి. కాని ఎక్కడా ఇలాంటి చర్యలు చేపట్టక పోవడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు, డివిజన్ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల స్థితిగతులను చూసిన దాఖలాలు కనబడటం లేదు. వరి పంటకు సోకిన తెగుళ్లపై సూచనలకోసం భైంసా ఏడీఏ కార్యాలయానికి మూడు రోజులుగా తిరిగినా అక్కడ ఆ అధికారి లేరని రైతు వాపోయడు. నాలుగోరోజు కలిసి రైతు పంట పరిస్థితి వివరించినా సస్యరక్షణ చర్యలు సూచించక పోవడం గమనార్హం. సోన్ మండలం పాక్‌పట్ల, సోన్, శివారులో వరి పొలాల్లో నాటిన కుదుళ్లు మురిగి పోతున్నాయి. వాటికి మొగి పురుగు ఆశించిందని ఎకరాకు సుమారు 2వేల పురుగు మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు వాపోయారు. ఇంతవరకు అధికారులు వచ్చి సూచనలు ఇవ్వడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భైంసా మండలం ఇలేగాం, సిరాల, వానల్‌పాడ్, సుంక్లి తదితర గ్రామాలతో పాటు ముథోల్ మండలం పిప్రి శివారులోనూ వేల ఎకరాల్లో వరికి తెగుళ్లు ఆశించాయి. ఇప్పటికే ఎకరాకు రూ.15వేలు ఖర్చుచేసి నాట్లు వేసుకున్న రైతుల పంటలను కాపాడలేక పోతే తీవ్రనష్ట వాటిల్లే ప్రమాదం ఉంది. వరిలో తెగుళ్లు ఆశించినట్లు నా దృష్టికి వచ్చింది. డివిజన్, మండల వ్యవసాయ అధికారులతో పాటు ఏఈవోలను క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని, రైతులకు నివారణ చర్యలపై సూచనలివ్వాలని ఆదేశించాం. వరిలో మొగి పురుగు ఆశించినట్లు గుర్తించాం. నివారణకు నాటు వేసిన 18నుంచి 21రోజుల లోపు ఎకరానికి క్లోరాంట్రానిలిప్రోల్ గుళికల మందు ఎకరానికి 4కేజీల చొప్పున ఇసుకలో మిశ్రమం చేసి చల్లాలి. పురుగు మందులు క్లోరాంట్రానిలిప్రోల్, లాంబ్డా సైహలోథ్రిన్ ఒక లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారి చేయాలి. పొలం మడులను ఆరబెడుతూ నీటిని అందిస్తే సల్ఫర్‌డయాక్సైడ్ గాలిలో చేరి మొగి పురుగు తీవ్రత తగ్గుతుంది. వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టకుంటే నష్ట వాటిల్లే అవకాశం ఉంది.

# బోధనకు దూరంగా భాషా పండితులు



ఆదిలాబాద్ పాలనాప్రాంగణం: బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పదో తరగతి విద్యార్థుల చదువు లకు ప్రతిబంధకంగా తయారైంది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయంలో బదిలీ ప్రక్రియతో ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించని పరిస్థితి నెలకొనడం ఫలితాలపై ప్రభావం చూపుతుందన్న భయం వెంటాడుతోంది. వేసవిలో జరపాల్సిన బదిలీ, పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం కిందటి నెల 28 నుంచి శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి పాఠశాల ఎలాగూ వదులుతున్నామని కొందరు, పదోన్నతి వస్తుందని మరికొందరు, బదిలీ అయితే ఎక్కడికి వెళ్తామని భావనలో ఇంకొందరు ఉండటం పాఠశాలల్లో బోధన పూర్తిగా గాడితప్పింది. మరోవైపు పదోతరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికీ శతశాతం పాఠ్యప్రణాళిక పూర్తిచేయలేదు. ఉదయం, సాయంత్రం పూట విద్యార్థులకు రోజుకో సబ్జెక్టు చొప్పున ప్రత్యేక పునశ్చరణ తరగతులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. సరిపడా సబ్జెక్టు టీచర్లు లేకసర్దుబాటు చేసి పది విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న సమయంలోబదిలీ ప్రక్రియకు తెరలేపడంతో ఉపాధ్యాయులు దరఖాస్తులు, పరిశీలన, అభ్యంతరాల పేరిట డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంకోవైపు పదోన్నతులలో తమకు అవకాశం ఇవ్వలేదనే ఆవేదనతో భాషా పండితులు 9, 10వ తరగతులకు బోధించడం లేదు. ఫలితంగా పదోతరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

# ‘పోడు’ భూముల సమస్య తీరేనా?



సిరిసిల్ల :పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడానికి సంవత్సర కాలం క్రితం దరఖాస్తులు తీసుకున్న రైతులకు, గిరిజనులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. గతేడాది నవంబరులో తీసుకున్న దరఖాస్తులపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో 67 బృందాల ద్వారా సర్వే చేశారు. ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను పొందుపర్చారు. ప్రభుత్వం పోడు సమస్య పరిష్కారం కోసం చర్చలు జరిపినా ప్రతి సారీ సమస్య తీరుతుందని ఆశలు పెంచుకుంటూనే ఉన్నారు. మళ్లీ పోడు పట్టాలు అందించే దిశగా చర్యలు ప్రారంభం కావడంతో పోడు రైతుల్లో ఆశలు మొదలయ్యా యి. దశాబ్దాల కాలంగా పోడు సమస్య ఉన్నా దరఖాస్తుల పరిశీలన జరిపి అందులో గిరిజనులకు ముందుగా హక్కు పత్రాలు అందించాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ఈ నెల 10వ తేదీ తరువాత ముఖ్యమంత్రి పట్టాలు అందిస్తారని గిరిజన శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ఇటీవల ప్రకటిం చడంతో గిరిజనుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గిరిజ నేత రులకు మాత్రం ఎదురు చూపులు తప్పవా అని చర్చిం చుకుంటున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వ ంలో డివిజన్ స్థాయిలో కమిటీలు సిఫార్సు చేసిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 7వ తేదీలోగా గిరిజనుల దరఖాస్తులను మరోసారి పరిశీలించనున్నారు. జిల్లాలో ఎనిమిది మండలాలు, 67 గ్రామాల్లో పోడు సమస్య ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా గిరిజనుల కంటే గిరిజనేతరుల నుంచి దరఖా స్తులు ఎక్కువగా రావడం గమనార్హం. జిల్లాలో 12 మండలాలు ఉండగా పోడు సమస్య ఉన్న ఎనిమిది మండలాల్లోని 67 గ్రామాల్లో గతేడాది సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కార్యదర్శి, రెవెన్యూ సహాయకులు, అటవీ బీట్ అధికారి, మండల సర్వేయర్లతో బృందాలు ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో 2005కు పూర్వం, 434. 80 ఎకరాల భూమి పోడుకు గురవగా తరువాత 7588.40 ఎకరాల్లో ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలన పూర్తి చేశారు. పోడుభూములపై ఆధారపడి ఉన్నవారి కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగమున్నా అనర్హులుగానే చూస్తున్నారు. గిరిజనులైతే 25 ఏళ్లపాటు, గిరిజనేతరులైతే 75 ఏళ్ల పాటు పోడు సాగు చేస్తున్నట్లు ఆధారాలు చూపిం చాల్సి ఉంది. రైతు కుటుంబానికి గరిష్ఠం పది ఎకరాలకు మించి ఉన్నా దానిని స్వాధీనం చేసుకోవాలని సర్కారు నిర్ణయించింది. అటవీ హక్కుల గుర్తింపుపోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వనున్నారు. 29 డిసెంబరు 2006 నుంచి ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం అమల్లోకి వచ్చింది. 2005కు ముందు సాగులో ఉన్న గిరిజనులకు మాత్రమే హక్కు పత్రాలు జారీ చేయనున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్నవారిని గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు ముందుకు వెళ్లనున్నారు.

# పట్టాలెక్కనున్న మూడోలైను పనులు




ఆసిఫాబాద్: ఉత్తరాది రాష్ట్రాలను అనుసంధానించే కాజీపేట– బల్లార్ష రైల్వేలైన్ అత్యంత రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో మూడోలైన్ పనులను దశాబ్దం క్రితమే ప్రారంభమయ్యాయి. కరోనా కారణంగా రెండేళ్ల పాటు పనుల పురోగతిలో అంతరాయం కలిగింది. తాజాగా కేంద్ర బడ్జెట్లో రూ.450.86 కోట్లు కేటాయించడం వల్ల పనులు వేగం పుంజుకోనున్నాయి. 235 కి.మీ. పొడవునా ఉండే ఈ లైన్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లా మందమర్రి నుంచి ఉప్పల్ వరకు, మహారాష్ట్ర మానిక్‌ఘర్ నుంచి వీరూర్ వరకు 110 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. వీరూర్ నుంచి రెబ్బెన మండలంలోని ఆసిఫాబాద్ రోడ్ వరకు 125 కి.మీ. మేర పనులు సాగుతున్నాయి. 2015–16 బడ్జెట్లో ఈ మార్గానికి రూ.2063 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం కేటాయించిన నిధులతో రాఘవపురం– పొట్కపల్లి, వీరూర్– మానిక్‌ఘర్ మార్గంలో విద్యుత్తు లైన్ పనులు చేయనున్నారు. 2021–22 బడ్జెట్లో ఈ మార్గానికి రూ.485 కోట్లు కేటాయించారు. అటవీ అనుమతులు, టైగర్ రిజర్వ్, కొవిడ్ కారణంగా కుమురం భీం జిల్లాలో పనులు ఆలస్యమయ్యాయి. కాజీపేట– బల్లార్ష మార్గంలో ఉన్న రెండో రైల్వే లైన్ నిరంతరం రద్దీగా ఉండడంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరడానికి గంటల తరబడి ఆలస్యం అవుతోంది. సింగరేణి బొగ్గును తీసుకెళ్లే రైళ్లు, సిమెంటు గూడ్సు, ప్యాసింజర్ రైళ్లు ఈ ప్రాంతం నుంచి వెళ్లడానికి సిగ్నల్ కోసం చాలా సమయం వేచి చూడాల్సి వస్తోంది. తాజాగా నిధుల కేటాయింపుతో పనులు వేగంపై ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గురుకులానికి స్వచ్ఛ నజరానా



లక్షెట్టిపేట:పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం స్వచ్ఛ గురుకులంగా రాష్ట్ర స్థాయిలో మెరిసి పురస్కారాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం, గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్వచ్ఛ గురుకుల్–2022 స్పెషల్ డ్రైవ్‌లో 168 గురుకులాల్లో ద్వితీయ స్థానంలో నిలిచి అందరి మన్ననలు పొందింది. నగదు బహుమతిగా రూ. 50 వేలు కైవసం చేసుకోవడం విశేషం. అంతకు ముందు జిల్లా స్థాయిలోనూ మొదటి బహుమతితో రూ.20 వేలు పొందింది. స్వచ్ఛ గురుకుల్–2022 స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో చెత్త ఏరివేయడం, పాఠశాల భవనం, డార్మిటరీలు శుభ్రపర్చడం, మరుగుదొడ్లు, మూత్రశాలలతో పాటు నీటి తొట్టిలను శుభ్రపర్చడంలాంటి కార్యక్రమాలు నిర్వహించారు.వంటగది, భోజన శాలలను శుభ్రపర్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో పచ్చదనం కోసం మొక్కలు నాటారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడా నికి వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వహించిన స్వచ్ఛ గురుకుల్– 2022 పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. గతంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించా ము. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతోనే అవార్డు సాకారం అయ్యింది. భవిష్యత్తులో ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తాం.

# ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలి



పెద్దపల్లి, : జిల్లాలో లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహిం చాలని కలెక్టర్ డాక్టర్ సంగీతసత్యనా రాయణ తెలిపారు. కలెక్టర్ డాక్టర్ సంగీతసత్యనారాయణ సమీ కృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో క్లస్టర్, డివిజన్ వారిగా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ వారి అభివృ ద్ధికి విశేష కృషి చేస్తోందన్నారు. ఆయి ల్ పామ్ సాగు ఎంతో లాభదాయక మని, రైతులు ప్రత్యామ్నాయ పంట కింద ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నారు. ఆయిల్ పామ్ సాగుతో నాలుగు ఏళ్లలో ఆదాయం కోల్పోకుండా అంతర్గత పంట లు వేసి ఆదాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం ఎకరానికి రైతు బంధుకు అదనంగా సంవత్సరానికి రూ.4200 సబ్సిడీ అందిస్తుందని, ఈ అం శాలను రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచిం చారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 1500 ఎకరాలలో ఫిబ్రవరి చివరి నాటికి ఆయిల్‌పామ్ మొక్కలు నాటేలా వ్యవసాయ విస్తరణ అధికా రులు, లక్ష్యాలు నిర్దేశించుకొని పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిబ్రవరి చివరినాటికి ఎట్టి పరిస్థితుల్లో జిల్లాకు కేటాయించిన లక్ష్యా లు పూర్తిచేయాలన్నారు. ఇప్పటికే మొక్కలకు డీడీ చెల్లించిన రైతుల నుంచి డ్రిప్ కోసం సైతం డీడీ తీసుకోవాలని, ఇప్పటివరకు 570 ఎకరాలకు డీడీ తీసుకున్నామని, మరో 958 ఎకరాలకు సంబంధించి రైతుల నుంచి డీడీలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు వీలుగా సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, ఈసీ, ఓసీ రైతులకు 5 ఎకరాలలోపు 90 శాతం, 5 ఎకరాల కుపైగా ఉన్నట్లయితే 80 శాతం సబ్సిఈ ఉందన్నారు. రైతులు వారి వాటా 10శాతం కానీ, 20శాతం కానీ జీఎస్టీతో కలిపి డీడీ తీయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 314 రైతులకు సంబంధించి 1101 ఎక రాలలో డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేశామన్నారు. వాటిలో ఇప్పటివ రకు 220 రైతులకు చెందిన 789 ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు పూర్తి చేశామని, మిగిలిన భూమిలో డ్రిప్ ఏర్పాటు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, వ్య వసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, పెద్దపల్లి హార్టికల్చల్ అధికారి జ్యోతి, రామగుండం, మంథని, హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్, వ్యవ సాయ శాఖ ఏడీఏలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అదనపు ఆదాయంపై బల్దియా ఫోకస్

కరీంనగర్ : నగరపాలక సంస్థ అదనపు ఆదాయాలపై దృష్టి సారిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలో హోల్‌సేల్, రిటైల్‌కు సంబంధించిన దాదాపు 10 వేలకుపైగా ఉన్న వాణిజ్య, వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సులను జారీ చేస్తే ఏటా బల్దియాకు లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ఇప్పటివరకు ట్రేడ్ లైసెన్సులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు అప్పగించడంతో చాలా మంది వ్యాపారులు వాటిని తీసుకోవడం లేదు. దీంతో నగరపాలక సంస్థకు ట్రేడ్ లైసెన్సు ద్వారా వచ్చే లక్షల రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా జారీ చేసి పన్నులు వసూలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నప్పటికి వాటిపై ఇప్పటి వరకు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఇటీవల ట్రేడ్ లైసెన్స్‌తోపాటు అన్ని రకాల ఆదాయాలను పెంచుకొని నగర అభివృద్ధికి వాటిని వినియోగించుకోవాలని పాలకవర్గం తీర్మానిం చింది. మేయర్ సునీల్‌రావు ఆధ్వర్యంలో ట్రేడ్ లైసెన్స్ జారీపై కమిషనర్ సేవా ఇస్లావత్‌తోపాటు ఇతర అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ట్రేడ్ లైసెన్సుల జారీపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం నగరంలోని రెవెన్యూ, శానిటరీ, ఇతర విభాగాలకు చెందిన 11 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆయా బృందాలకు ప్రాంతాలను కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో వంద శాతం ట్రేడ్ లైసెన్స్ జారీ చేసిన అధికారుల బృందానికి బహుమతి ఇస్తామని, లైసెన్సుల జారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జనవరి 11వ తేదీ నుంచి ఆయా బృందాలు నగరంలోని అన్ని దుకాణాల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్సుపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ కోసం గతంలో మాదిరిగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత అధికారులు ఆయా దుకాణాల వద్దకు వెళ్లి ఆ దుకాణం ఉన్న రోడ్డును బట్టి,ఏరియాను బట్టి అప్పటికప్పుడే ఫీజును నిర్ధారించి ఆ డబ్బులు చెల్లించిన వెంటనే లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు. 20 రోజులుగా ఈ ప్రత్యేక బృందాలు వ్యాపార వర్గాలకు అవగాహన కల్పించడంతో 1,592 మంది వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకున్నారు. దీంతో నగరపాలక సంస్థకు 33,18,121 రూపాయల ఆదాయం సమకూరింది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేస్తుండడంతో ఫిబ్రవరి, మార్చి రెండు నెలల కోసం ఇప్పుడు తీసుకోకుండా ఏప్రిల్‌లో తీసుకుంటే సరిపోతుందని పలువురు వ్యాపారులు భావిస్తున్నారు. దీంతో లైసెన్స్ జారీ ప్రక్రియ అనుకున్నంత వేగంగా సాగడం లేదు. లైసెన్స్‌లు తీసుకున్న వ్యాపారులు ఏప్రిల్‌లో రెన్యూవల్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. వ్యాపారులందరూ విధిగా లైసెన్స్‌లు



తీసుకోవాలని బల్దియా అధికారులు వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,428 మంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకున్నారు. మరో 10వేల మంది వరకు ఇంకా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవలసి ఉంటుంది. మార్చి 31వ తేదీ వరకు ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్‌ను జారీ చేస్తే నగరంలోని మొత్తం వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎన్ని ఉన్నాయనే లెక్కతోపాటు ఎంత ఆదాయం వస్తుందో తేలిపోతుంది. ఆ తర్వాత రెన్యూవల్ ఫీజు కూడా వస్తుందనే భావనతో బల్దియా అధికారులు ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

# అసైన్డ్ భూమిలో మట్టి దందా

సంగారెడ్డి :ఎలాంటి అనుమతులు లేకున్నా.. అసైన్డ్ భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. రాత్రి, పగలనే తేడా లేకుండా ట్రాక్టర్లతో ప్రైవేటు వెంచర్లకు తీసుకెళుతున్నా.. పట్టించుకునే వారే కరవయ్యారు. ఆయా ట్రాక్టర్లు మండల కా ర్యాలయాల పక్క నుంచే వెళుతున్నా.. ఎలాంటి చర్యలు లేవు. మట్టి దందా తీరుపై కథనం. మండల కేంద్రమైన కొండాపూర్ సర్వే నంబరు 555లో 120 ఎకరాల విస్తీర్ణంలో అసైన్డ్ భూమి ఉంది. ఇక్కడ కొంత మంది పంటలు సాగు చేస్తున్నారు. జూనియర్ కళాశాల, మార్కెట్ గోదాంతో పాటు ప్రభుత్వ భవనాలు కట్టారు. మిగిలిన భూమిలో ఎర్రటి మొరం(మట్టి)పై వ్యాపారుల కన్ను పడింది. ఇదే మండలంలోని తొగర్‌పల్లిలో నూతన వెంచర్ల కోసం ఇక్కడి మొరాన్ని నిత్యం తరలిస్తున్నారు.

## అధికారుల అనధికారిక చర్యలతో

# అన్నదాతల ఇబ్బందులు

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్రయ విక్రయాల నిలిపివేత

### - ఉపాధి కోల్పోతున్న హమాలీలు, ఇతర కార్మికులు



ఖమ్మం : రాష్ట్రంలోని ప్రధాన వ్యవసాయమార్కెట్లలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఒకటి. కానీ అధికా రులు తీసుకుంటున్న అనధికారిక నిర్ణయాలతో రైతులు, మార్కెట్‌లోని హమాలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మార్కెట్‌లో ప్రతీ మిర్చి పంట తప్ప అపరాలు, పత్తి కొనుగోళ్లు యథావిధిగా జరిగేవి. కానీ మూడు, నాలుగు నెలలుగా రోజున పత్తి, అపరాల యార్డులకు కూడా ఎలాంటి సమాచారం, ప్రకటన ఇవ్వకుండానే సెల వులు ఇస్తుండటంతో విషయం తెలియక పంటలు అమ్ముకునేందు కు వస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తమకు వచ్చే ఉపాధి నష్టపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ సెలవు దినాలు, ఆదివారం మాత్రమే సెలవులు ఉండి.. మిగతా రోజుల్లో క్రయవిక్రయాలు జరగాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా వారంలో ఐదు రోజులు మాత్రమే మార్కెట్ యార్డులను నడిపిస్తుతండటంతో సుదూర ప్రాంతాల నుంచి పంటలను అమ్మకానికి తీసుకువచ్చే రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అదీగాక శని, ఆదివారాలు వరుసగా సెలవులు ఉంటుండటంతో ప్రతీ సోమవారం పంట ఎక్కువ మొత్తంలో వస్తుండటంతో వ్యాపారులు అదు ను చూసి ధర తగ్గిస్తున్నారు. ఫలితంగా రైతులకు ఆశించిన మేర ధరలు దక్కడంలేదన్న విమర్శలు వినిసిస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రతీ మార్కెట్‌లో మిర్చి పంట మినహాయించి పత్తి, అపరాలు లావాదేవీలు యథావిధిగా జరిగేవి. ఇటీవల సెలవని ఎవరికి తెలియకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి పంటలను మార్కెట్ తీసుకొచ్చిన రైతులు మార్కెట్ మూసి ఉండటంతో తమ పంటలను వెనక్కు తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులు భరించలేక ఇక్కడే దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వారికి తక్కువ ధరలకు తమ పంటలను అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే మార్కెట్ అధికారుల నుంచి అధికారికంగా పత్తి, అపరాల యార్డులకు సెలవు ప్రకటించకపోవడంపై పలు విమర్శలు వినిసిస్తున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని మార్కెట్‌లో పని చేసే కార్మికులు సెలవుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌కు అప్రకటిత సెలవు ఉండటంతో మార్కెట్‌లో పని చేసే సుమారు 2 వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోతుండగా, మార్కెట్ ఉత్పత్తులపై ఆధారపడే చిన్న చిన్న పరిశ్రమలలో పని చేసే హమాలీలు, మహిళలు సుమారు వెయ్యి మందికి పైగా ఉపాధిని కోల్పోతున్నట్టు సమాచారం. కాగా రైతుల ఇబ్బందుల దృష్ట్యా మార్కెట్‌ను యథావిధిగా నడిపించాలని రైతులు, కార్మికులు, రైతు సంఘాలు కోరుతున్నాయి. నిత్యం పంటలతో కళకళలాడే మార్కెట్ సెలవు ఉండటంతో కళ తప్పిందని పలువురు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో పత్తిని కొనుగోలు చేసే వ్యాపా రులకు (పత్తి ట్రేడర్లకు) చెల్లించిన జీఎస్టీ మళ్లీ చెల్లించాలని నోటీసులు రావడంతో వారు నిరసనగా గతంలో సుమారు 15 రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపి వేశారు. అనంతరం వారికి జీఎస్టీ నోటీసుల వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో శనివారాలు క్రయవిక్రయాలు నిలిపేయాలని నిశ్చయించుకోవడంతో వారికి చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు కూడా అండగా నిలవడంతో మార్కెట్‌ను అప్రకటిత బంద్ పెట్టినట్లు తెలుస్తోంది

# 'బాలవెలుగు'పై నిర్లక్ష్యపు చీకట్లు

### - ఉపాధ్యాయులు, సిబ్బందికి 11నెలలుగా అందని వేతనాలు
### -నిధులు రాక సందిగ్ధంగా పాఠశాలల నిర్వహణ




ఖమ్మం: సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా పాఠశాలలు లేని మారుమూల గ్రామాల్లోని చిన్నారులకు అ,ఆల నుంచి ఐదోతరగతి వరకు విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో 1995లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బాలవెలుగు పాఠశాలలపై నిర్లక్ష్యపు చీకట్లు కమ్ముకున్నాయి. ఉపాధ్యాయులు, సిబ్బందికి వేతనాలు రాక.. నిర్వహణకు నిధుల్లేక నీరసించిపోతున్నాయి. ఈ పాఠశాలలు ప్రారంభమైన తొలిఏడాదిలో ఉమ్మడి జిల్లాలో 32 వేల మంది విద్యార్థులు చదువుకోగా.. అధికారుల కృషితో ప్రస్తుతం ఆ సంఖ్య కేవలం 1,168కు చేరుకుందంటే.. రోజురోజుకు వీధిబాలల సంఖ్య తగ్గుతోందనడానికి నిదర్శనం. ఇందులో అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి ఎంతో దాగిఉంది. అలా ఇన్నేళ్లుగా విజయవంతంగా నడుస్తున్న బాలవెలుగు పాఠశాలల మనుగడ ప్రస్తుతం కష్టంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 35 బాలవెలుగు పాఠశాలలుండగా.. వలస కుటుంబాలకు సంబంధించిన పిల్లలు ఒక్కో పాఠశాలలో 25 నుంచి 30మంది వరకు చదువుతున్నారు. మొత్తం 74మంది ఉపాధ్యాయులు, 15 మంది అసిస్టెంట్ క్లర్కులు, 38మంది ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఉపాధ్యాయులు ఒక్కొక్కరికి నెలకు రూ. 7వేలు, సహాయకులకు రూ. 3500వేతనాలు ఇస్తున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో బాలవెలుగు పాఠశాలల నిర్వహణ కష్టతరంగా మారింది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ వేతనాలు ఇవ్వలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఇస్తున్నా స్థానిక అధికారి నిర్లక్ష్యంతో ఉపాధ్యాయులు పస్తులుంటున్నారు. దీంతో బాలవెలుగు ఉపాధ్యాయులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించడంతో 4 నెలల జీతాలను అందించారని పలువురు ఉపాధ్యాయులు వాపోయారు. పెండింగ్ వేతనాలతో పాటు గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధి కారిని పిలిచి వెంటనే వేతనాలు అందించాలని ఆదేశించారు. గతంలో ఈ బాలవెలుగు పాఠశాలలో చదువుకొన్న చిన్నారులు ప్రస్తుతం పాఠశాలలు మూతపడటంతో బాలకార్మికులుగా పనులకు వెళ్తున్నట్టు వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బాలవెలుగు పాఠశాలలను పునఃప్రారంభించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని పలువురు బాలవెలుగు ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు. జిల్లాలో బాలవెలుగు పీడీగా ఉన్న అధికారి బాలవెలుగు పాఠశాలలను తీసేశారని, కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలు వచ్చాయని చెబుతున్నట్టు సమాచారం. అయితే అలాంటి జీవో కానీ, ఉత్తర్వులు కానీ ఎక్కడా కనిపించడం లేదు. వాటిని ఇవ్వడానికి కూడా సదరు అధికారి ముందుకు రావడం లేదు. కేవలం నోటి మాటగా ఆదేశాలు జారీచేస్తూ చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిధులు, సామగ్రి ఇవ్వని కారణంగా పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది. అయితే ఆదేశాలకు సంబంధించిన జీవో కాపీ కానీ, ఆర్డర్స్ కానీ చూపించాలని కొందరు ఉపాద్యాయులు పీడీని కోరగా ఆమె చూపలేదని, దీంతో సదరు ఉపాధ్యాయులు ఆర్డర్ కాపీ వచ్చే వరకు విధులకు హాజరవుతున్నట్టు తెలిసింది. ఆ పాఠశాలలో విద్యార్థులకు అందించాల్సిన మధ్యాహ్న భోజనాన్ని కూడా అందించడంలేది తెలిసింది. విద్యార్థులే ఇంటి నుంచి భోజనాన్ని తెచ్చుకోని పాఠశాలకు హాజరవుతున్నారు.

# భూముల అమ్మకంపైనే ఆదాయం ఆశలు



హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టబోతోంది. గత ఏడాది కంటే భారీగా పద్దులు ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఖర్చులు సరే.. మరి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది..? ఈ సందేహం అందరికీ వస్తుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం ఈ సారి ప్రజాకర్షక పథకాలను పెంచేందుకు ప్రజలపై ఓ మోస్తరుగా పన్నులు పెంచడంతో పాటు భూముల అమ్మి ఎక్కువగా నిధులు సమీకరించుకోవాలని చూస్తున్నట్లుగా తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే పన్నుల్లో తెలంగాణ వాటా 2.10 శాతం. ఈ ప్రకారం రూ. 21,470 కోట్లు తెలంగాణకు వస్తాయి. వీటికి కేంద్ర ప్రభుత్వ పథకాలు.. ఇతర గ్రాంట్స్ కూడా కలిపి రాష్ట్రానికి రూ. 38 వేల కోట్లు మాత్రమే అందనున్నాయి. అప్పుల పరిమితిపై కూడా కేంద్రం నియంత్రణ విధించనుంది. ఈ ఏడాది కార్పొరేషన్ల పేరుతో చేసిన అప్పులను కూడా పరిగణనలోకి తీసుకుని వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిబంధనల ప్రకారం రావాల్సిన అప్పులను కూడా నియంత్రించడం ఖాయంగా కనిపిస్తోంది. అందుకే.. బడ్జెట్‌లో ఎంత మేర అప్పులను లక్ష్యంగా పెట్టుకున్నా.. వాటి లక్ష్యం మేర బహిరంగ మార్కెట్ రుణాలను సాధించుకోవడం అంత తేలిక కాదు. తెలంగాణ ప్రభుత్వ ఆదాయం పెంపునకు రకరకాల మార్గాలను అన్వేషించినట్లుగా తెలుస్తోంది. అందులో ఇసుక లాంటి వాటి ధరల పెంపు దగ్గర్నుంచి చాలా మార్గాలను రెడీ చేసుకుంది. వరదల కారణంగా వాగులు, వంకలు, ప్రాజెక్టులు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక భారీగా పేరుకుపోయింది. దీంతో కొత్తగా ఇసుక రీచ్‌ల వేలం, రాయల్టి పెంచే అవకాశం ఉంది. గతంలో భూములు, ఇండ్లు, ప్లాట్ల మార్కెట్ విలువలను రెండేళ్లకు పట్టణాల్లో, మూడేళ్ల కోసారి గ్రామీణ ప్రాంతాల్లో సవరించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఇటీవలే సవరించింది. ఎప్పుడైనా మార్కెట్ విలువలను పెంచుకునేందుకు వీలుగా ఈ నిర్ణ యం తీసుకోగా మరోసారి మార్కెట్ విలువల సవరణకు ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. తాజాగా స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖలో ఎల్ఆర్ఎస్‌లేని, అనుమతిలేని లే అవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిల్చిపోవడం, సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో రాబడి తగ్గిపోవడంతో దీనిపై పున: సమీక్ష చేసి ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంది. హైదరాబాద్ శివార్లలో భూములను వేలం వేసి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు సమీకరించుకుంది. ఈ సారి జిల్లాల్లో కూడా భూములు వేలం వేయాలన్న ఆలోచన చేస్తోంది. నిరుపయోగ భూములు 32 జిల్లాల్లో గుర్తిం చిన వివరాల సేకరణ, అమ్మకం, రాజీవ్ స్వగృహ ఇండ్లు, కార్పొ రేషన్ పరిధిలోని భూముల అమ్మకం, దిల్‌కు సంబంధించిన భూములపై ఉన్న కేసును పరిష్కరించుకుని వీటి విక్రయాలు నిర్వహించి ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని తెలుస్తోంది. తెలిసింది. అదేవిధంగా పలు శాఖల్లో పేరుకుపోయిన బకాయిలు, వన్‌టైం సెటిల్‌మెంట్లకు ఉన్న అవకాశాలు, కేంద్రం వద్ద ఉన్న బకాయిలను వసూలు చేసుకునే అవకాశాలతో బడ్జెట్‌లో అంచనాలను ప్రతిపాదించనున్నట్లుగా తెలుస్తోంది.

### అభివృద్ధి పనులు ప్రారంబించిన ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి :కాసిపేట మండలంలో పలు అభివృద్ధి ,సంక్షేమ పథకాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.మండలంలోని గట్రావుపల్లి లో 7 లక్షల 60 వేల రూపాయలతో హెల్త్ సబ్ సెంటర్ భవనం శంకు స్థాపన చేశారు, అనంతరం గట్రావుపల్లి నుండి సొనాపూర్ గ్రామా నికి వెళ్లే వంతెన పరిశీలించారు.సోనపూర్ గ్రామపంచాయితీ పరిధిలోని బాదుగూడలో 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు, రొట్టేపల్లి గ్రామంలో పంప్ హౌస్ వద్ద కొమురం భీమ్ గారి విగ్రహ ప్రతిష్టాపణ చేసి నివాళులు అర్పించారు.పల్లంగూడ గ్రామంలో మన ఊరు–మన బడి, మన బస్తి–మన బస్తి కార్యక్రమంలో భాగంగా 23 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభించారు.మండలంలో 58 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను ఎమ్మెల్యే చిన్నయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు అందచేశారు.ఈ కార్యక్రమాలలో ఎంపీపీ లక్ష్మి, వైస్ ఎంపీపీ విక్రమ్ రావు, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీలు రామ్ చందర్, చంద్రమౌళి, సర్పంచ్ లు రాజు, సుశీల, విజయ, సంపత్ నాయక్,స్వప్న , జంగు, బాదు, కవిత , ఉప సర్పంచ్లు తిరుపతి , సుమన్, ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బోల్లు రమణా రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు పోషం, నాయకులు అనంత్ రావు, రామ్ చందర్ , ప్రేమ్ కుమార్ , సింగు, కార్యకర్తలు, ఎమ్మార్వో దిలీప్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

### - పట్టణాల్లో అడ్డగోలుగా కొనసాగుతున్న భవన నిర్మాణాలు
### - కొత్త మున్సిపల్ చట్టాన్ని సైతం లెక్కచేయని వైనం



కామారెడ్డి : జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు కొనసాగు తున్నాయి. ఆయా పట్టణాల్లో కొత్తకొత్త కాలనీలు వెలుస్తుండడం, మున్సిపాలిటీ అంతకు అంతగా విస్తరిస్తుండడంతో భవన నిర్మాణాల సంఖ్య సైతం పెరుగుతోంది. అపార్ట్‌మెంట్‌ల కల్చర్ సైతం చాలానే వచ్చింది. అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం గత రెండేళ్ల కిందట కొత్త మున్సిపల్ చట్టాన్ని అమలు చేసింది. కానీ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో ఈ చట్టం అమలు కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మూడు మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న పలుచోట్ల దరఖాస్తులను మున్సిపల్ అధికారులు తిరస్కరించినప్పటికీ ఆ నిర్మాణాలు కొనసాగు తునే ఉన్నాయి. స్థానిక నేతల అండదండలతో అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆయా మున్సిపాలిటీలకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాల అనుమతులకు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ విధానం అమలవుతునే ఉంది. ఆయా పట్టణాల్లో ఎవరైన నిర్మాణాలు చేపట్టాలంటే అనుమతి కోసం మీ సేవలోని టీఎస్ బీపాస్ ద్వారా దర ఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల నుంచి భవన నిర్మాణాలకు భారీగా దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త మున్సిపల్ చట్టం నిబంధనల ప్రకారం 120 గజాల స్థలం ఉన్నవారు ఇళు కట్టుకోవాలంటే 1.5 మీటర్ల సెట్‌బ్యాక్ వదలిపెట్టాలి. రోడ్డు 30 అడుగులు ఉంటే ఇరువైపుల 5 అడుగుల చొప్పున స్థలాన్ని మున్సిపాలిటీకి అటాచ్ చేయాలి. ప్రధాన రహదారి అయితే ఈ సెట్ బ్యాక్ మూడు మీటర్లు ఉండాలి. ఈ నిబంధనలు అన్ని కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్‌లు ఏర్పాటు చేస్తూ అందులో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణాలు చేస్తున్నారు. రోడ్ల అంచువరకు నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాకుండా బల్దియాలో పార్కింగ్ స్థలాలు కనిపించడం లేదు. హోటల్‌లు, ఆసుపత్రులు, వ్యా పార సముదాయాలు, పాఠశాలలు, కళాశాలల నిర్మాణాలు అయితే నూతన చట్టం ప్రకారం 25 శాతం స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఎక్కడా కూడా అమలు కావడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్న జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో జీప్లస్ 2, జీప్లస్ 3, జీప్లస్ 4 అనుమతి తీసుకుని నిర్మించుకుంటున్న ఇళ్ల మీద నీళ్ల ట్యాంకుల నిర్మాణం పేరుతో అదనపు స్లాబ్‌లు వేస్తున్నారు. వాస్తవానికి ట్యాంక్ నిర్మిస్తే దాని కింద ఇంటి నిర్మాణం ఉండకూడదు. ఉంటే అదనపు గదిగా పరిగణిస్తారు. దీంతో దాని అక్రమ కట్టడం కింద లెక్క కడతారు. ఇలా అనుమతి ఒకలా తీసుకుంటూ నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. ఇలాంటి వాటిని కొందరు కౌన్సిలర్‌లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. సదరు ఇంటి యజమానుల వద్ద లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ వారు అడిగినంత ఇవ్వకుంటే మున్సిపల్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి పనులు ఆపివేయిస్తున్నారు. దీంతో చేసేదేమిలేక సదరు యజమానులు స్థానిక కౌన్సిలర్‌లకు ముడుపులు ఇచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా కొందరు అయితే మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకోకపోవడమే కాకుండా కనీసం నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలకు చెందిన డ్రైనేజీ, రోడ్లను కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. కానీ స్థానిక నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనుకడుగు వేస్తుండడంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదని తెలుస్తోంది.

# డయల్ 100ను వినియోగించుకోవాలి

ఎదులాపురం : జిల్లా ప్రజలందరు డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీసు అసోసియేషన్ 2023 సంవత్సర నూతన క్యాలెండర్‌ను అధికారులతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆపద సమయంలో బాధిత ప్రజ లకు జిల్లా పోలీసులు అండగా ఉండాలన్నారు. ఆపత్కాలంలో డయల్ 100ను సంప్రదిస్తే ఐదు నిమిషాల లోపు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ డీఎస్పీలు వీ ఉమేందర్, పోతారం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ జే కృష్ణమూర్తి, రిజర్వ్ సీఐ డీ వెంకటి, ఎస్ఐ అన్వర్ ఉల్ హక్, అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, కే అనసూయ తదితరులు ఉన్నారు.డీసీఆర్బీ (డిస్టిక్ క్రైమ్ రికార్డ్ బ్యూరో) డీఎస్పీగా పోతారం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరిం చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డికి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు. ఆసిఫాబాద్ జిల్లా డీసీఆర్బీ సీఐగా విధులు నిర్వర్తించి గత నెల 27వ తేదీన డీఎస్పీగా పదోన్నతి పొందారు.

# అభివృద్ధికి ఆటంకంగా నిధుల లేమి

### పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలు



ఖమ్మం : దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఈ సారి బడ్జెట్‌లోనైనా పరిష్కారం దక్కుతుందని ఉమ్మడి జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండటం, సోమవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా నేతలు గళం వినిపించాలని, గత హామీలతో పాటు తాజా ఇచ్చిన హామీలను నెరవేర్చేం దుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు కేటాయింపు చేస్తారని ఆకాంక్షిస్తున్నారు. వచ్చేదిఎన్నికల ఏడాది కావడంతో.. ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు ప్రవేశపెట్టబోయే బడ్జెట్ అందుకు అనుగుణంగా ఓటర్లను ఆకట్టుకునేలా ఆకర్షణీయ పథకాలు తెస్తారని, సాగు, తాగు నీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉమ్మడిజిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ సాగునీటి ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి భారీగా నిధుల అవసరం ఉంది. గతేడాది జూనలోనే సీతారామా ద్వారా సాగునీరు అందాల్సి ఉన్నా కరోనా పరిస్థితలు, నిధుల సమస్యతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ. 13,500 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమై ఆరేళ్లు దాటింది. ఇప్పటి వరకు రూ. 6,200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా సగం నిధులు మంజూరు కావాల్సిఉంది. ప్రస్తుతం రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషనతోపాటు ఆంధ్రాబ్యాంకు, పవర్ ఫైనాన్స కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకుని పనులు నిర్వహిస్తున్నారు. 36టీఎంసీలగోదావరి నీటిని నిల్వచేసేలా ఇక రూ. 2,700కోట్లతో సీతమ్మసాగర్ పనులు చేపట్టారు. దీనిలో ఇప్పటి వరకు సుమారు రూ. 500కోట్లు మంజూరయ్యాయి. ఈసారిబడ్జెట్‌లో నీటిపారుదల శాఖ సుమారు రూ.వెయ్యికోట్లు అవసరమని ప్రతిపాదన చేసినట్టు సమాచారం. ఖమ్మంజిల్లా పరిధిలో కూడా సీతమ్మసాగర్ కాలవను పాలేరుకు అనుసంధానం చేసే పనులకు రూ. 500కోట్లపైగా నిధులు అవసరం ఉండగా.. ఇవన్నీ మంజూరైతేనే ప్రాజెక్టు లక్ష్యం పూర్తయ్యే అవకాశం ఉంది. అలాగే తాలిపేరు, పెదవాగు, కిన్నెరసాని, బయ్యారం చెరువు, వైరా, బేతుపల్లి, లంకాసాగర్, పాలేరు ఇరిగేషన ప్రాజెక్టుల ఆధునీకరణ పనులకు ప్రాజెక్టు నిర్వాహణ, నాగార్జునసాగర్ ఎడమకాలువ ఆధునికీకరణకు నిధులు అవసం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో మెడికల్ కళాశాల ప్రారంభమవగా, ఖమ్మం మెడికల్ కళాశాల వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. అయితే కొత్తగూడెంమెడికల్ కాలేజీకి అధునాతన భవనాల నిర్మాణం, వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాల్సి ఉంది. అలాగే ఖమ్మం కళాశాల కోసం తాత్కాలికంగా ఖమ్మం పాత కలెక్టరేట్, జిల్లా ఆసుపత్రిలోని కొన్ని భవనాలను కేటాయించగా.. వచ్చే విద్యాసంవత్సరంనుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ భవనాల నిర్మాణానికి, వసతులకు, ల్యాబ్‌లు ఏర్పాటుకు రూ.వెయ్యికోట్ల వరకు నిధులు అవసరం ఉంటుంది. ప్రస్తుత అవసరాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపును బట్టి మెడికల్ కాలేజీలో సౌకర్యాలు ఏర్పడనున్నాయి. గతనెలలో సమీకృత కలెక్టరేట్ల ప్రారంభోత్సవాల కోసం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇరు జిల్లాలపై వరాల జల్లు కురిపించారు. కానీ వాటిని నెరవేర్చేందుకు అవసరమైన నిధుల కేటాయింపుపై ఎలాంటి ప్రకటనలు చేయలేదు. దీంతో ఈ బడ్జెట్‌లో వాటి ప్రస్తావన ఉంటుందని అంతా ఆశిస్తున్నారు. జనవరి 12న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ప్రారంభం సందర్భంగా సీఎం వచ్చి పలు పనులకు, స్థానిక సంస్థలకు నిధులిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగూడెంలో మైనింగ్ కళాశాలను పూర్తిస్థాయి ఇంజనీరింగ్ కళాశాలగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కానీ జీవో విడుదల చేయలేదు. దీనికోసం రూ. 110కోట్లతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించారు. ఇక జిల్లాలో 481 పంచాయతీలకుగాను ప్రతీ పంచాయతీకి రూ. 10లక్షలు ఇస్తామనగా వాటి కోసం సర్పంచలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే పాల్వంచ, కొత్తగూడెం మునిసిపాలిటీల అభివృద్ధికి రూ. 40కోట్లు, ఇల్లెందు, మణుగూరు మునిసిపాలిటీలకు రూ. 25కోట్ల చొప్పున మంజూరుచేస్తామని ప్రకటించారు. ఆ నిధులొస్తేనే అభివృద్ధి పనులు జరిగే అవకాశం ఉంది. అలాగే కొత్తగూడెం జర్నలిస్టులకు ఇళ్లస్థలాల హామీ ఇచ్చినా జీవో ఇవ్వలేదు. జిల్లా అధికారులు సింగరేణి స్థలాన్ని పరిశీలించినా ఆ కలనెరుతుందో లేదోనన్న అనుమానాలున్నాయి

# పోలవరం ముంపుపై మరోసారి అధ్యయనం

భద్రాచలం, : పోలవరం బ్యాక్ వాటర్‌తో కిన్నెరసాని, ముర్రేడువాగుల ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఆ నదుల నీరు వెనక్కి పోటేస్తుందని, తద్వారా తెలంగాణలోని పలు ప్రాంతాలు మునిగిపోతాయన్న రాష్ట్ర ఆందోళనలపై కేంద్ర జలశక్తి శాఖ స్పందించింది. పోలవరం నిర్మాణంతో కిన్నెరసాని, ముర్రేడువాగుల వాగులపై పడే ప్రభావం గురించి తెలంగాణను సంప్రందించి ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి డిమార్కేషన్ చేయాలని ఏపీని ఆదేశించింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు కేంద్రజలశక్తి శాఖ లేఖ రాసింది. పోలవరం బ్యాక్ వాటర్‌పై సంయుక్త సర్వేకు అంగీకరించబోమని ఇంతకాలం చెబుతూ వస్తున్న ఏపీకి కేంద్ర జలశక్తి శాఖ తాజా నిర్ణయం షాక్ ఇచ్చిన్నట్లయింది. 13వ తేదీన పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సహ పలు రాష్ట్రాలతో కేంద్ర జలశక్తిశాఖ సమావేశం కానున్న నేప?థ్యంలో ఈ లేఖ ఎంతో ప్రాధన్యతను సంతరించుకుంది. పోలవరం బ్యాక్ వాటర్‌తో కిన్నెరసాని, ముర్రేడువాగుల ఫరిదిలో 891ఎకరాలు ముంపునకు గురవుతాయని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కిన్నెరసాని, ముర్రేడువాగులతో పాటు గోదావరిలో కలిసే మొత్తం 35ఉపనదుల ప్రవాహంపై పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం ఏ మేరకు ఉంటుందో సర్వే చేసి, డిమార్కేషన్ చేయాలని తెలంగాణ గత కొన్ని ఏళ్లుగా పట్టుబడుతోంది. 2022 నవంబర్ 10న పోలవరం ముంపుపై భద్రాద్రి ఏజెన్సీలోని ప్రాంతాల్లో ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారులు ముంపుపై ప్రాథమిక సర్వే చేసిన విషయం తెలిసిందే. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై క్షత్రస్థాయి ఆధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేప?థ్యంలో పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ(పీటీఏ) ఇరు రాష్ట్రాలకు చెందిన నీటి పారుదలశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఇది ప్రాథమిక సర్వే మాత్రమేనని, మలివిడత మరో సర్వే ఉంటుందని నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే బ్యాక్ వాటర్ కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సరిహద్దుల్లోని



గోదావరి నదీ పరివాహక గ్రామాలు ముంపునకు గురి కానున్నాయి. అయితే ఈ ముంపు ప్రభావం ఎంత మేరకు ఉంటుంది? క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఏమిటి? ఎంత మంది నిర్వాసితులు కానున్నారు ?, ముఖ్యంగా భద్రాద్రి రామాలయానికి ఎంతమేరకు ముంపు పొంచి ఉంది, పరివాహక ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు, చారిత్రక కట్టడాల పరిస్థితి ఏమిటి వంటి ప్రశ్నలకు నేటి వరకు పూర్తిస్థాయిలో సమాధానం లేదు. వాస్తవానికి పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా రామాలయంతో పాటు నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు, చారిత్రక నిర్మాణాలకు భారీగా ముంపు ప్రమాదం పొంచి ఉందని ఇప్పటికే సాగునీటిరంగ నిపుణులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావం ఎంత మేరకు ఉంటుందనే విషయమై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలనే డిమాండ్ వినిపిస్తూనే ఉంది. ఈ క్రమంలో గతంలో బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)లో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌పై విచారించిన ఎన్‌జీటీ ముంపు ప్రభావంపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ముంపు ప్రాంతాల్లో ఇందుకోసం స్వతంత్ర సంస్థతో అభిప్రాయ సేకరణ చేయాలని ధర్మాసనం సూచించింది. 2018 చివర్లో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది.

# ‘జలకళ’పై రైతుల్లో తీవ్ర అసంతృప్తి

ఏలూరు:ప్రభుత్వం తెచ్చిన ‘వైఎస్ఆర్ జలకళ’ పథకం రైతులకు ఏమాత్రం అక్కరకు రాని దుస్థితి నెలకొంది. ఈ పథకం అమలు అత్యంత పేలవంగా ఉందంటూ రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్న తీరుతో బోర్లు వేసుకు నేందుకు సైతం చాలాచోట్ల రైతులు ముందుకు రాని పరిస్థితి ఏర్ప డింది. 2020 సెప్టెంబర్ 28న వైఎస్ఆర్ జలకళ పథకానికి ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 3,705 బోర్లు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గడిచిన రెండున్నరేళ్లలో అధికారుల లెక్కల ప్రకారం చూస్తే 1,178 బోర్లు వేసినట్లు చూపిస్తున్నారు. లక్ష్యం మేరకు రెండువేలకుపైగా బోర్లు వేయాల్సి ఉ న్నప్పటికీ ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఇక వేసినట్లు లెక్కలు చూపు తున్న బోర్లలో సగానికి కూడా విద్యుద్దీకరణ జరగలేదని రైతులు చెబుతున్నారు. అంటే బోరు వేసినా రైతులకు ఏమాత్రం ప్రయో జనం చేకూరలేదని తేటతెల్లమవుతోంది. జలకళ పథకంలో ఉన్న లోపాలే దీనికి కారణంగా రైతులు చెబుతున్నారు. రెండున్నర ఎకరా ల నుంచి ఐదెకరాలు వరకూ ఉన్న ప్రతి రైతూ జలకళలో బోరు వేసుకునేందుకు అర్హులే. బోరు కోసం దరఖాస్తు చేసుకుని నెలలు, ఏళ్లు గడుస్తున్నా వేసిన పరిస్థితి లేదని రైతులు చెప్పుకొ స్తున్నారు. జలకళ పర్యవేక్షణ సైతం అత్యంత దారుణంగా ఉందనే భావన రైతులకు వ్యక్తమవుతోంది. ఈ పథకంలో కాంట్రాక్టర్‌దే ఇష్టారాజ్యం అన్నట్లు సాగుతోంది. తొలుత విద్యుత్ కనెక్షన్ కూడా ప్రభుత్వమే ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత విద్యుత్ కనెక్షన్ రైతులు వేయించుకోవాలని మాటమార్చింది. ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్న పని కావడంతో రైతులు జంకుతున్నారు. 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2022 నవంబర్ 30వ తేదీ వరకూ జిల్లాలో 127 బోర్లు మంజూరైతే 57 బోర్లకు మాత్రమే డ్రిల్లింగ్ జరిగింది. దీనిలో విద్యుద్దీకరణ పూర్తయిన బోర్లు కేవలం ఆరు మాత్రమే. దీన్నిబట్టి జలకళ జిల్లాలో ఏవిధంగా ముందుకు సాగుతుందో చెప్పనక్కర్లేదు. బోరు వేయాలంటే కనీసంగా రూ.ఐదు లక్షలకుపైనే ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం రూ.రెండు లక్షలు మాత్రమే జలకళ పథకంలో అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఉచిత బోరు అంటూ చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేకుండాపోయిందని రైతులు చెబుతున్నారు.



రైతులకు బోరు మంజూరైతే సంబంధిత కాంట్రాక్టర్ రైతులతో మాట్లాడి బోరు వేయాల్సి ఉంటుంది. అయితే చాలాచోట్ల ఆవిధంగా కాకుండా రైతులే అన్ని ఖర్చులూ పెట్టుకుని బోరు వేసుకోవాలని కాంట్రాక్టర్లు సూచిస్తున్నారు. బోరు వేసుకున్న తర్వాత తాము వచ్చి రిగ్గుతో ఫొటో తీసుకుంటామని, ప్రభుత్వం సొమ్ము వేసిన తర్వాత రైతుకు ఇస్తామని చెబుతున్నారు. దీనిలో అధికార పార్టీ నాయకుల జోక్యం విపరీతంగా ఉంటోందని రైతులు చెప్పుకొస్తున్నారు. బోరు వేయించుకునే రైతులు కనీసంగా రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు అనేక మండలాల్లోని రైతులు వాపోతున్నారు. సొంత సొమ్ము ఖర్చు పెట్టుకుని బోరు వేసుకునే స్థోమత ఉంటే జలకళ పథకంలో దరఖాస్తు చేసుకోవడం ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చాలాచోట్ల మంజూరైన బోర్లు కూడా వేయకుండా ఉండిపోయినట్లు రైతులు చెబుతున్నారు. జలకళ పథకంలో ఏదైనా సమస్య వస్తే గ్రామస్థాయిలో రైతులు ఏఅధికారిని కలవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కాంట్రాక్టర్, స్థానిక వైసిపి నాయకులు చెప్పిందే వేదం అన్నట్లు తయారైంది. ఇలా అనేక కారణాలు ఉండటంతో రైతులు బోర్లు వేసుకునేందుకు సైతం ముందుకు రావడం లేదని తెలుస్తోంది. జలకళ పథకంలో బోర్లు వేసుకునే విషయంలో ఎదురవుతున్న సమస్యలతో రైతులు బోరుమంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని జలకళ అమలులో సమస్యలపై కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తే రైతులు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుంది. లేకపోతే ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమం ఎండమావిగానే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడనుంది.

# నాలుగు లైన్లుగా ఆదోని బైపాస్ రోడ్డు



ఆదోని:పట్టణ శివారులో 167వ జాతీయ రహదారికి అనుసంధానంగా ఆదోని – ఎమ్మిగనూరు రహదారి నుంచి ఆదోని – పత్తికొండ రహదారి మీదుగా ఆదోని – ఆలూరు రహదారి వరకు కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డును 150 అడుగుల్లో నాలుగు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధ్యక్షతన ఆర్‌అండ్‌బి శాఖ, ఎన్‌హెచ్ శాఖ అధికారులతో బైపాస్ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని నాలుగు లైన్లుగా మార్పు చేసి 100 నుంచి 150 అడుగులకు విస్తరించేందుకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం బైపాస్ రోడ్డు నిర్మాణానికి 100 అడుగుల భూసేకరణ జరిగిందని చెప్పారు. దీనిని మరో 50 అడుగులు పెంచి 150 అడుగులతో నాలుగు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాలుగు లైన్ల రోడ్డుగా బైపాస్ రోడ్డు నిర్మించాలని జాతీయ రహదారుల మండలి డైరెక్టర్ సూచించారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఇప్పటికే మార్క్ వేసిన 100 అడుగుల రోడ్డు పనులు చేపట్టాలని, రెండో విడతగా మిగిలిన రోడ్డు విస్తరణకు భూసేకరణ చేసేందుకు చర్చించుకుందామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారని వివరించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం త్వరలోనే టెండర్లు పిలుస్తారని, రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభమ వుతాయని తెలిపారు. అలాగే మరో 50 అడుగుల కోసం భూ సేకరణ రెండో విడతగా చేపడతామన్నారు. బైపాస్ రోడ్డులో భూములు, ప్లాట్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని తెలిపారు. ఎన్‌హెచ్ నిబంధనల ప్రకారం నష్టపరిహారం ఉంటుందని చెప్పారు. బైపాస్ రోడ్డు బాధితులు ఎవరూ నష్ట పరిహారం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బాధితులందరికీ ఆశించిన స్థాయి కన్నా అధికంగానే పరిహారం ఇచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఆదోని పట్టణ అభివృద్ధికి, బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం అందరూ సహకరించాలని కోరారు. ఎన్‌హెచ్ శాఖ అధికారి ఇంద్ర, ఎమ్మెల్యే ప్రత్యేక సలహాదారులు నరసింహమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి’ సోషల్ ఆడిట్‌లో రూ.66వేల రికవరీకి ఆదేశం

నందవరం :మండలంలో ఉపాధి హామీ చట్టంలో రూ.కోట్లలో పనులు జరిగితే రూ.66 వేలు రికవరీ చూపించి చేతులు దులుపుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ ప్రజా వేదిక సమావేశం నిర్వహిం చారు. ఉపాధి హామీ అడిషనల్ పీడీ సలీం బాష హాజరయ్యారు. మండలంలో ఉపాధి హామీ చట్టం కింద 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు 14 పంచాయతీల్లో రూ.1.59 కోట్ల ఉపాధి పనులు జరిగాయి. గ్రామాల్లో ఉపాధి పనుల్లో రికవరీ మాత్రం రూ.66,874 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. రికవరీకి ఆదేశించిన పంచాయతీల్లో అత్యధికంగా నాగలదిన్నె రూ.43,032, అత్యల్పంగా కనకవీడు రూ.310, సోమలగూడూరు రూ.3750, గురజాల రూ.1500, ఇబ్రహీంపురం రూ.1074, మిట్టా సోమాపురం రూ.4874, నందవరం రూ.709, నది కైరవాడి రూ.1625, పొనకలదిన్నె రూ.7500 చొప్పున రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే కొన్ని పనుల్లో రీప్లేస్‌మెంట్ కింద రూ.1,66,803 తిరిగి చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. రూ.కోట్లలో పనులు జరిగితే రూ.వేలల్లో రికవరీ చూపించడంతో అక్కడికి వచ్చిన ప్రజలు అవాక్కయ్యారు. ఇలాగే సామాజిక తనిఖీలు జరిగితే ప్రభుత్వానికి సామాజిక తనిఖీ కోసం అయ్యే



ఖర్చు డబ్బులు కూడా రాని పరిస్థితి ఉంటుందని ప్రజలు విమర్శలు వ్యక్తం చేశారు. జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి సిద్ధ లింగమూర్తి, డిఆర్‌డిఒ ఎఒ షరీఫ్, ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఏపీడీ అల్లిపీరా, క్వాలిటీ కంట్రోలర్ గోవర్ధన్, పిఆర్ ఎఇ జయన్న, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, ఎపిఒ మాలిక్ బాషా పాల్గొన్నారు. మిట్టా సోమాపురం ఫీల్డ్ అసిస్టెంట్ వీరస్వామి అవినీతికి పాల్పడుతున్నారని, వెంటనే తొలగించాలని మిట్టా సోమాపురం సర్పంచి లక్ష్మీదేవి తనయుడు, వైసిపి నాయకులు నరసింహులు కోరారు. సోషల్ ఆడిట్‌లో జిల్లా అడిషనల్ పీడీకి గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

# ‘యువగళం’తో వైసిపి ఉక్కిరిబిక్కిరి:టిడిపి

కడప : ఓ పక్క లోకేష్ యువ గళం పాదయాత్ర, మరో వైపు అవినాష్ రెడ్డి సిబిఐ కేసులు, సొంత పార్టీ ఎమ్మెల్యేల ఎదురు దాడితో వైసిపి సర్కార్ ఉక్కిరిబిక్కిరి అవుతోందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ జనార్ధన్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోలీసులు ప్రజలకు రక్షక భటులా, లేదా భక్షకభటులా అని ప్రశ్నించారు.

నారా లోకేష్ పాదయాత్రకు రోజురోజుకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి వైసిపి సర్కార్‌కు చెమటలు పడుతున్నాయని అన్నారు. పాదయాత్ర ఇలాగే కొనసాగితే తమకు ఓటమి తప్పదని గ్రహించి పోలీసులను ఉసిగొల్పి పాదయాత్రకు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. డిఎస్‌పి సుధాకర్ రెడ్డి నాయకత్వంలో పోలీసులు యువగళం పాదయాత్రలో



పాల్గొన్న వాలంటీర్ల పైన దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, ఒకరు ఆ సుపత్రిలో చావు బతుకులతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలకు నాయకులకు అనుమతులు ఇచ్చి నిబంధనలు ఉల్లంఘించారంటూ లోకేష్‌తో పలువురిపై కేసులు నమోదు చేయడం దారుణమని వాపోయారు.

# రైతులకు మీటరు కష్టాలు!

అమరావతి : వ్యవసాయ పంప్‌సెట్లకు విద్యుత్తు మీటర్ల బిగింపు కష్టాలు ఆదిలోనే మొదల వుతున్నాయి. బ్యాంకు ఖాతాల్లో కనీస బ్యాలెన్సు రూ.వెయ్యి ఉండాల్సిందేనని బ్యాంకులు డిమాండ్ చేస్తున్నాయి. అదేవిధంగా.. వ్యవసాయ విద్యుత్తుకు 5 హార్స్‌పవర్ ఐఎసఐ విద్యుత్తు మోటార్లను మాత్రమే వాడాలం టూ ఇంధన శాఖ మార్గదర్శకాలు ఉ న్నాయి. అయితే.. 10 హార్స్‌పవర్ మోటార్లను రైతులు అత్యధికంగా వాడుతున్నా రు. అదేవిధంగా 200 అడుగులు కంటే ఎక్కువలోతుకు తవ్విన పంప్ సెట్లకు అధిక లోడు విద్యుత్తు పడుతుంది. ఇప్పటిదాదా విద్యుత్తు వినియోగంపై లెక్కలు తీయలేదు. ఇప్పుడు లెక్కలు తీస్తే.. 10 హార్స్‌పవర్ మోటార్ల వాడకం పై జగన్ సర్కారు తీసుకునే నిర్ణయం ఎలా ఉండబోతుందోనన్న భయాందోళనలను రైతులు వ్యక్తంచేస్తున్నారు. మాగాణి రెండున్నర ఎకరాలు, మెట్ట ఐదెకరాలకు మించ ని కుటుంబాలకే ఉచిత వ్యవసాయ విద్యుత్తు పథకం వర్తిస్తుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు పెంచినట్లే పెంచి... తండాలు, ఎస్సీ కాలనీలకు మాత్రమే ఈ పథకాన్ని జగన్ సర్కారు పరిమితం చేసింది. మైదాన ప్రాంతాల్లోనూ.. ఎస్సీ కాలనీలకు అవతల నివసించే ఎస్సీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని సర్కారు అమలు చేయడం లేదు. అదేతరహాలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకం అంటూనే, స్మార్ట్ మీటర్లు బిగించాక.. రెండున్నర ఎకరాల మాగాణి.. ఐదెకరాల మెట్ట భూములంటూ పాత మార్గదర్శకాల బూజును దులుపుతుందేమోనన్న భయం రైతులను వణికిస్తోంది. కేంద్రం నిర్దేశించకపోయినా రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్(ఆర్‌డీఎస్ఎస్) పేరిట రాష్ట్రంలో వ్యవసాయ పంప్ సెట్లన్నింటికీ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు విద్యు త్తు పంపిణీ సంస్థలు సిద్ధమయ్యాయి. ఇందుకోసం రాష్ట్రం లో 18.56 లక్షల మీటర్లను కొనుగోలు చేసేందుకు టెండర్లను పిలిచాయి. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లను ‘ఏపీసీపీడీసీఎల్’ అమర్చింది. రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకం 2004 నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వాలు మారుతున్నా .. ఈ పథకం నిరాటంకంగా కొనసాగుతోంది. వ్యవసాయ విద్యుత్తు కింద రైతు ఎంత విద్యుత్తు వాడుతున్నా నాటి ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర రెడ్డి, కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబునాయుడు ప్రభుత్వాలు లెక్కలు కట్టే ప్రయత్నం చేయలేదు. వ్యవసాయానికి ఎంతైనా విద్యుత్తును ఇస్తామని గత ప్రభుత్వాలు ప్రకటించాయి. అలాగే అమలు చేశాయి కూడా. కానీ, జగన్ అధికారంలోకి రాగానే.. అన్ని వర్గాలతో పాటు రైతులకూ కష్టాలు మొదలయ్యాయి. వ్యవసాయ విద్యుత్తు వాడకానికీ




లెక్కాపత్రం ఉండాలని ఆయన ఆదేశించారు. ఇందుకోసం ప్రతి వ్యవసాయ పంప్‌సెట్‌కూ మీటర్లను బిగించాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే, శ్రీకాకుళం జిల్లాలో వాటి బిగింపు తర్వాత... ఎంత విద్యుత్తు వాడకం జరిగిందో .. గతంలో విద్యుత్తు వాడకానికి .. మీటర్ల బిగింపువల్ల తగ్గిన విద్యుత్తు వినియోగానికి మధ్య వ్యత్యాసమెంతో డిస్కమ్‌లు వివరించలేక పోతున్నాయి. ఎంత విద్యుత్తు పొదుపు చేశారో ‘ఏపీఈపీడీసీఎల్’ స్పష్టం చేయలేకపోతోంది. గతంలో ప్రభుత్వం ఉచిత విద్యుత్తు పథకం కింద సబ్సిడీ రూపంలో ఎంత చెల్లించేదో .. శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా వ్యవసాయపంపసెట్లకు మీటర్లు బిగించాక .. ప్రభుత్వంపై సబ్సిడీ భారం ఎంత తగ్గిందో కూడా ‘ఏపీఈపీడీసీఎల్’ స్పష్టత ఇవ్వడంలేదు. ప్రయోగాత్మకంగా చేపట్టిన పథకం వల్ల కలిగే ప్రయోజనం ఎంతో డిస్కమ్‌లు రైతులకు సమాధాన పరచలేని స్థితిలోకి వెళ్లిపోయాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా.. ప్రభుత్వంపై ఒక్కో వ్యవసాయ మీటరుకు రూ.35,000 భారం పడేలా డిస్కమ్‌లు మీటర్ల కొనుగోలుకు సిద్ధమయ్యాయి. ప్రభుత్వంపై భారీగా భారం పడుతున్నా, ఆస్థాయిలోనే విద్యుత్తు పొదుపు ద్వారా రెట్టింపు ఆదా అవుతుందని ఇటుప్రభుత్వంగానీ, అటు డిస్కమ్‌లుగానీ స్పష్టం చేయలేకపోతున్నాయి. దీంతో.. అస్మదీయుల కోసం ప్రభుత్వపెద్దలు ఇచ్చిన ఆదేశాలతోనే డిస్కమ్‌లు స్మార్ట్ విద్యుత్తు మీటర్లను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. స్మార్ట్ మీటర్లను వ్యవసాయ పంప్‌సెట్లకు బిగించడం వల్ల రైతుకు ఎంత మేలు జరుగుతుందో తగ్గుతుందో డిస్కమ్‌లు వివరించలేకపోతున్నాయి. అయిన ప్పటికీశ్రీకాకుళం ప్రయోగాన్ని బూచి గా చూపిస్తూ .. రాష్ట్రంలో 18.56 లక్షల మంది రైతుల పంప్‌సెట్లకు మీటర్లను బిగించాలని డిస్కమ్‌లు సిద్ధమయ్యాయి. ముందస్తుగా సర్కారు నుంచి మీటర్ల కొనుగోలు కోసం నిధులు మంజూరయ్యాకే టెండర్లను పిలవాలని డిస్కమ్‌లను రాష్ట్ర ఇంధన నియంత్రణ సంస్థ(ఏపీఈఆర్‌సీ) ఆదేశించింది.

# పోషకాల బియ్యం ఆరోగ్యానికి నయ్యం



ఆదిలాబాద్, : పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. ప్రజల్లో రక్తహీనత ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పోషకాలతో కూడిన ఈ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నది. ఐరన్, బీ 12 విటమిన్, ఫోలిక్ యాసిడ్ కలిగి ఉండే ఈ బలవర్ధక బియ్యాన్ని ఈ నెల నుంచి ప్రజలకు అందించనున్నది. కాగా, వినియోగంపై అధికార యంత్రాంగం ఇప్పటికే ఆయా చోట్ల ప్రజలకు అవగాహన కల్పించింది. ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ఎలాంటి అపోహలు అవసరం లేదని సూచించింది. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర సర్కారు వివిధ పథకాలను ప్రవేశపెడుతున్నది. ముఖ్యంగా ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రక్తహీనత ఎక్కువగా ఉన్న జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా పోషకాహార బియ్యం పంపిణీ చేయనుండగా, ఇందులో ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలు ఉన్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 15 నుంచి 49 ఏండ్ల వయసున్న వారిలో రక్తహీనత 57 శాతం, ఆరేండ్లలోపు చిన్నారుల్లో 67 శాతం ఉంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కూడా చాలా మందిలో రక్తహీనత ప్రధాన సమస్యగా మారింది. దీంతో ఈ నెల నుంచి ఫోర్టిఫైడ్ రైస్‌ను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఐరన్, బీ 12 విటమిన్, ఫోలిక్ యాసిడ్ కలిగి ఉండే బియ్యం పేదలకు బలవర్ధకమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. రేషన్ దుకాణాల్లోని కార్డుదారులకు పూర్తిస్థాయిలో ఫోర్టిఫైడ్ రైస్‌ను పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఈ బియ్యంతో పోషకాల ఆహారం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 355 రేషన్ దుకాణాలు ఉండగా 1,92,078 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా ప్రభుత్వం 3494 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 300 రేషన్ దుకాణాలు ఉండగా 1,40, 029 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా ప్రభుత్వం 2315 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నది. జనవరి నుంచి లబ్ధిదారులందరికీ ఫోర్టిఫైడ్ రైస్ అందించనుంది. ఆదిలాబాద్ జిల్లాలో ఆరు నెలలుగా అధికారులు రేషన్ బియ్యం దుకాణాల ద్వారా సాధారణ బియ్యంలో కలిపి పంపిణీ చేస్తున్నారు. కొందరు ప్లాస్టిక్ బియ్యంగా భావించడంతో అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. బియ్యం వాడకంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లకు శిక్షణ ఇచ్చారు. ఆ మేరకు డీలర్లు రేషన్ కార్డు దారులకు అవగాహన కల్పిస్తున్నారు. పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ అందించబోతున్నాం. ఇది బలవర్ధకమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. శరీరంలో రక్తం ఉత్పత్తి పెరగడంతోపాటు, ఎర్ర రక్తకణాల పెరుగుదలకు దోహదం చేస్తుంది. సహజ రక్తకణాలు బలంగా ఉండడానికి, ఆరోగ్యకరమైన బలమైన కణాలు, ఎర్ర రక్తకణాలను తయారు చేస్తుంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**